ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
నవంబర్ 22, 2015

కొనిపించడానికి కొన్ని రోజులు

ఒక్కసారేగా అనుకుంటే..
తొమ్మిదేళ్లు తిప్పవేసింది

భార్య పిల్లలతో...

బాలీవుడ్ సుప్రసిద్ధ తారలు సునీల్ దత్, నర్గీస్ దంపతుల ముద్దుల తనయుడు సంజయ్ దత్. దేనికీ లోటు లేని కుటుంబం. సంజూ బాబు ఏది అడిగితే అది క్షణాల్లో అందేది. తర్వాత ఎన్నో మలుపులు. బోర్డింగ్ స్కూల్లో చదువు, మాదక ద్రవ్యాలు, సినీ రంగ ప్రవేశం, కేసులు, కోర్టులు, జైలు శిక్ష, నటన, చిత్ర నిర్మాణం...ఒక జీవితంలో ఇన్ని ఎత్తుపల్లాలా అనిపించక మానదు. పూణే ఎరవాడ జైల్లో శిక్ష అనుభవిస్తున్న సంజయ్‌దత్ గురించి ...

- సంజూభాయ్ జైలు బయటే సెలబ్రెటీ. లోపల ఒక సాధారణ ఖైదీ. ఎలాంటి ప్రత్యేక ఏర్పాట్లు, సౌకర్యాలు లేవు. దొంగలు, హంతకులతో కలిసి తిండి తింటూ, నిద్రపోవడం. అన్నట్టు ఈ మధ్య కాలంలో... పద్దెనిమిది కేజీల బరువు తగ్గాడు. సిగరెట్లు ఎక్కువగా తాగుతాడు. ధమని సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు.
- గతంలోకి వెళితే...బోర్డింగ్ స్కూల్లో చేరడం అతని జీవితంలో ప్రధానమైన మలుపు. అక్కడ ఒంటరిగా తనను తాను సంభాళించుకోవాల్సి రావడమనేది కొత్త బాధ్యత. అయితే తన మీద ఇతరుల అజమాయిషీని అంత త్వరగా అంగీకరించే రకం కాదు సంజయ్ బాబు. ఆఖరికి తన కుటుంబం అయినా సరే.
- కాలేజీలో వుండగా ఒకరోజు ఎవరో వచ్చి 'ఒక్కసారి...' చూడమని మాదకద్రవ్యాలను ఇచ్చారు. అది ఆ తర్వాత తొమ్మిదేళ్లపాటు తిష్టవేసుకుని కూర్చుంది. పత్రికల్లో రాసే అన్ని రకాల డ్రగ్స్ వాడేశాడు. పౌడి, ఇంజక్షన్లు, బిళ్లలు అన్నీ... ఓ రోజు హెరాయిన్ తీసుకున్నాక ...రెండు రోజుల పాటు అలా నిద్రపోతూనే వుండిపోయాడు. లేచాక బాగా ఆకలిగా అనిపించింది. ఏదైనా వండి పెట్టమన్నాడు నౌకర్ని. అతను 'బాబా... నువ్వు రెండు రోజుల తర్వాత నిద్ర లేచా వు...' అంటూ బావురుమన్నాడు.

ఆ మాటతో నివ్వెర పోయి హుటా హుటిన అద్దం దగ్గరకెళ్లి పరీక్షగా చూసుకున్నాడు. మొహం అంతా పీక్కుపోయింది. కళ్లకింద నల్లటి చారలు. అలాగే కొనసాగితే తనకు తను దక్కననుకున్నాడు.

- వెంటనే తండ్రి దగ్గరకెళ్లి కాపాడమని కోరాడు. కొద్ది రోజుల పాటు స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించాక అమెరికాలోని రిహాబిలిటేషన్ సెంటర్‌కు పంపారు. చికిత్స పూర్తయ్యాక మొదట ఇండియా అసలు రానన్నాడు. కానీ తండ్రి ఒత్తిడి మేరకు వచ్చాడు. తీరా వచ్చిన కొద్ది రోజులకే డ్రగ్స్ అందించే బ్రోకర్ ఇంటి ముందు ప్రత్యక్షమయ్యాడు. అసలు తను ఇండియా వస్తున్నట్టే ఎవ్వరికీ చెప్పలేదు. అలాంటిది అతనికి ఎలా తెల్సిందో సంజయ్‌కు అర్థం కాలేదు. ఇప్పుడు కానీ ఒక్కసారి ఔనంటే ఇక జీవితాంతం వాటికి బానిస కావాల్సి వుంటుందనుకుని 'నో' చెప్పేశాడు.
- తర్వాత యథావిధిగా సినిమాల్లో బిజీ అయిపోయాడు. 'సాజన్ నుంచి మున్నా భాయ్' వరకు ఎన్నో విజయవంతమైన చిత్రాలు చేశాడు. మంచి నటుడిగా విమర్శకుల మన్ననలు, అభిమానుల అభినందనలు అందుకున్నాడు. 'అగ్నిపథ్' చిత్రంలో విలనిజం పండించి మెప్పు పొందాడు.
- ఆ తర్వాత చట్టవిరుద్ధంగా ఆయుధాలు కలిగివున్నాడన్న కేసుమీద అరెస్టు...జైలు జీవితం కారణంగా అతిథి పాత్రలకే పరిమితం అయ్యాడు. 'జంజీర్, పోలీస్‌గిరి, జిల్లా ఘజియాబాద్, పీకే' వంటి చిత్రాలు మంచి హిట్ అయ్యాయి.
- ఇక ... జైల్లో ఖాళీ దొరికినప్పుడల్లా స్క్రిప్టులు రాసుకుంటున్నాడు. అన్నీ కలిసొస్తే...త్వరలో పని కూడా మొదలపెడతాడట.

★

ప్రజాశక్తి

snehaweekly.praja@gmail.com

నేతల నిజాయితీ

ఒక వ్యక్తి గురించి బంధుమిత్రులు, తోటి విద్యార్థులు, ఉద్యోగులు అడపాదడపా ప్రశంసిస్తూనే వుంటారు. కానీ అతను 'నిజాయితీపరుడు' అన్న ఒక్క సర్టిఫికెట్ ముందు ఇదిగో ఇలాంటి ఎన్ని అభినందనలైనా దిగదుడుపే. అంత పవర్‌ఫుల్ మాట అది. పండితుడైనా పామరుడైనా ఎవరైనా సరే జీవితంలో ఆ ఒక్క మాట అనిపించుకోగలిగితే చాలు. వారి జన్మ ధన్యమైనట్టే.

అప్పుడప్పుడు పత్రికల్లో... ఆటో డ్రైవర్ నిజాయితీ, దొంగ నిజాయితీ, కూలీ నిజాయితీ, విద్యార్థి నిజాయితీ... వంటి వార్తలు సచిత్ర కథనాలుగా చూస్తుంటాం. అప్పటివరకు ఆటోలో ప్రయాణించిన కస్టమర్ విలువైన నగో, పెద్దమొత్తంలో నగదో ఆటోలో మర్చిపోయి వెళ్లిపోతే...జాగ్రత్తగా తీసుకెళ్లి మరీ ఇచ్చిరావడమంటే చిన్న విషయం కాదు. కచ్చితంగా అది అతనిలోని నిజాయితీకి నిదర్శనమే. వృత్తి రీత్యా దొంగ అయితేనేం! అందులోనూ ఎంతో కొంత నిజాయితీ వ్యక్తం చేస్తుంటారు కొందరు. దొంగతనానికి వెళ్లినచోట తను ఎంత తీసుకెళ్లిందీ, ఏం తీసుకెళ్లిందీ నోట్ పెట్టి మరీ వెళ్తుంటారు. చోరీ చేయడం నేరమే. అయినప్పటికీ అందులో ఎంతోకొంత నిజాయితీతో వ్యవహరించడమే ఇక్కడ న్యూస్. 'అతనా! తిండికి లేకపోయినా... కాళ్లు కడుపులో పెట్టుకుని పడుకుంటాడుకానీ..ఎవ్వరి ముందూ చెయ్యి చాచడు. గొప్ప నిజాయితీపరుడు...' అన్న మాటలు కార్యాలయాల్లో అత్యంత అరుదుగా వినిపిస్తుంటాయి.

◆ మనలో మాట

సామాన్యులు సరే. పాలకుల్లో నిజాయితీ ఎంత? అంటే... 'నేతి బీరలో నెయ్యి చందమే.' ఎంపీలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, మేయర్లు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, పంచాయతీ సభ్యులు... ఎవర్ని తీసుకున్నా అంతే! నిజాయితీపరులను గద్దె సమీపానికి సైతం రానీకుండా సాధ్యమైనంత వరకు జాగ్రత్త పడుతుంటారు పైసలున్న పెద్దలు. దాంతో ఇప్పుడు నిజాయితీ అనే మాటకు ఆమడ దూరంలో వున్న వారికి... డబ్బు మూటలున్న వారికే టికెట్లు, సీట్ల కేటాయింపులు. వీరు ఎన్నికల సందర్భంగా ఎన్నికల సంఘానికి సమర్పించే వివరాల్లోనూ నిజాయితీకి స్థానమే లేకుండా జాగ్రత్త పడుతుంటారు. చదివిన విద్య, దాని తాలూకు సర్టిఫికెట్లు.. ఆస్తులు... పాస్తుల వివరాలన్నీ తప్పుల తడకల. దొంగ సర్టిఫికెట్లే. కేవలం ఆ కారణంగానే కేసులు, కోర్టుల చుట్టూ తిరుగుతూ పదవులు పోగొట్టుకున్న వారిని ఎందర్ని చూడలేదు. ఇక వీరు ఎన్నికల ముందు చేసే వాగ్దానాలు, ప్రకటించే మేనిఫెస్టోలకు ... ఎన్నికలయ్యాక గద్దెనెక్కాక వారు నెరవేర్చేదానికి పొంతనే వుండదు. ముందు ఏవేవో చెప్పేస్తారు. అరచేతిలో స్వర్గం చూపించేస్తారు. అసలు వాటిని నెరవేర్చగలమా? లేదా? అన్న విచక్షణే వారిలో అణుమాత్రం కనిపించదు. వందల కోట్ల రూపాయలతో విశ్వస్థాయి రాజధానిని నిర్మిస్తానని బాబుగారు తెగ ఊదరకొట్టారు. ఇప్పుడు దాని పరిస్థితి ఎక్కడ వుందంటే...వేసిన కాడే వుంది. ఒక్క అంగుళం కూడా కదల్లేదు. మోడీజీ సైతం అంతే. ప్రధాని అయిన దగ్గర నుంచి విదేశీ ప్రయాణాలతోనే సరిపోతోంది దేశ ప్రజల గురించి ఆలోచించింది చేసింది తక్కువ. వారి దాకా ఎందుకు? పంచాయతీ సభ్యులు ఎంతెంత పొడవాటి వాగ్దానాలు చేస్తారనీ. సిమెంటు రోడ్లంటారు. గుళ్లంటారు. బళ్లంటారు. అలా చెప్పేస్తూనే వుంటారు. తమకు ఎంత మేర నిధులొస్తాయి? చేసిన వాగ్దానాలను నెరవేర్చడం ఎంతవరకు సాధ్యం? అన్న విచక్షణే వారిలో కనిపించదు.

నిజంగా చెప్పింది చేయాలన్న నిజాయితీ వుంటే ఉత్తుత్తి వాగ్దానాలతో ఊదరగొట్టేయ్యరేమో ఈ నాయకీమణ్యులు.

■



టపా

'పంచ్' అదిరింది

బందిలి రతన్‌రాజు రచనతో కళ్లు చిదంబరాన్ని మా జ్ఞాపకాలల్లో నిలిచేలా చేశారు. పక్షి ప్రేమికుడు సి.శేఖర్ వంటి కారుణ్యమూర్తులను మనసారా అభినందించాల్సిందే. సురేంద్రకుమార్ 'ఫోన్ పోయిందా పట్టుకోండిలా' విషయ సరంజామా అంతా ఉపయోగకరంగా ఉంది. పంచ్ కార్టూన్ అదిరింది. మనలో మాటగా రాజకీయ నేతలను తుస్సు టపాసులతో పోల్చడం సహేతుకమే!

నేమాన సుభాష్ చంద్రబోస్, పి.యం.పాలెం, విశాఖపట్నం.

చిచ్చర పిడుగులు సూపర్

దీపావళి టపాసుల్ని మించి చిందులేయించింది ఈ వారం స్నేహ. వయసుకు మించిన తెలివితేటలతో విదేశీ వేదికలపైన తమ సత్తాను చాటి వరల్డ్ రికార్డులు తిరగరాస్తున్న చిచ్చర పిడుగులు అబ్బురపర్చారు. సమాజంలో, కొన్ని కుటుంబాల్లో పెరిగిపోతున్న సమస్యల్ని పరిష్కరిస్తున్న ఎర్రదండు సేవలు శ్లాఘనీయం. ఇటీవల కొన్ని చీకటి గ్రామాలకు అద్దాలతో సూర్యకాంతిని రప్పించడం నిజంగా అద్భుతం. సినిమాల్లో నవ్వులు పూయిస్తున్న అనేక మంది హాస్యనటులు మరణిస్తున్నారు. కళ్ళు చిదంబరం కూడా దూరం కావడం బాధాకరం. ఆర్.కె.లక్ష్మణ్ వ్యంగ్య చిత్రాలు కనువిందు చేశాయి.

టి.సత్యనారాయణమూర్తి,మల్కాపురం, విశాఖపట్నం

రెండో సూర్యుడు

కొండలలోయలో సూర్యుడి వెలుతురు కూడా తెలియని గ్రామాలు, ఊళ్లు చాలానే ఉన్నాయి.కొండలు చుట్టి ముట్టి సూర్యుని వెలుతురును ఆపుతున్నటుగా ఉంటాయి. అలాంటి గ్రామాలకు వెలుతురు ప్రసాదించడం నిజంగా అద్భుతం.టెక్ గురూ చాలా బాగుంది. ప్రపంచం అంతా అరచేతిలోకి తెచ్చింది సెల్‌ఫోన్. అలాంటి ఫోన్‌కు కావాల్సిన ఫీచర్స్ ఇవ్వడం బాగుంది.

ఎం. సునీత, సికె దిన్నె, కడప.

కథ చాలా బాగుంది

కళ్ళు చిదంబరం ఈ పేరు తలుచుకోగానే మన కళ్ల ముందు ప్రత్యక్షం అయ్యే వ్యక్తి. చీఫ్ ఇంజనీర్‌గా పనిచేసిన ఈయన నాటకాల మీద ఆసక్తితో సినీ రంగం వైపు అడుగులు వేయడం యాదృచ్ఛికమైనా నటన జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలను అధిగమించిన వ్యక్తి. 'పల్లకీ కుచ్చు' కథ చాలా బాగుంది. భర్తపోయి... అటు పుట్టింటికి, ఇటు మెట్టినింటికి కాకుండాపోయిన వారు సమాజంలో ఎలాంటి కష్టాలు పడతారనేది కళ్ళకు కట్టారు రచయిత.

స్వాములు,కర్నూలు

పాత విషయాలు తెలిశాయి

పిల్లలపై భారం పడకుండా వారి ఇష్టాయిష్టాలకు తగ్గట్టు వారు ఎంచుకున్న రంగంలో ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు వస్తాయి. బలవంతం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనవలసి వస్తుందని అట్టమీద కథ ద్వారా తెలుసుకున్నాం. ఫోన్‌కు సంబంధించి సురేంద్రకుమార్ చాలా ఫీచర్స్ తెలియచేశారు.

లక్ష్మణ రావు,విజయనగరం

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

ఈ సంచికలో....

కొనిపించడానికి కొన్ని రోజులు

కవర్ స్టోరీ 6

అమ్మ కోసం మదర్స్ డే, నాన్న కోసం ఫాదర్స్ డే, అమ్మమ్మ తాతయ్యల కోసం గ్రాండ్ పేరెంట్స్‌డే, ప్రేమికుల కోసం వాలెంటైన్స్ డే... ఈ జాబితా చాలా సుదీర్ఘమైనది. ఎవరికోసమైతే ఆ రోజును కేటాయించారో వారికి గిఫ్ట్ కొనిస్తే... మనకు వారి మీద ప్రేమ, అభిమానం వున్నట్టు. లేకపోతే... లేనట్టు...అన్న వాతావ రణం చుట్టూ పరచుకుందివాళ.

స్ఫూర్తి 3
కూరగాయలమ్మిన చేత్తోనే క్యాన్సర్ చికిత్స చేస్తోంది

ప్రత్యేకం 4
పురాతన వాడ

యువ 5
యాప్ టీచర్ ఇమ్రాన్

కవిత్వమ్ 10
చదువుల తల్లీ... నీ పయనమెటు

జీవనం 11
తేనెలూరు ఊరు

సినిమా కబుర్లు 14
నాటకాల రాయుడు

వింత లోకం 16
స్నానాల బస్సు

సంస్కృతి 17
అక్కడ రావణుడిని పూజిస్తారు

కథ 18
మెటిల్డా

రుచి 21
కన్నడ ఘుమఘుమలు

బాల నేస్తాలు 22
బారెడు రెక్కలున్నా...ఎగరలేదు

కొత్త పుస్తకాలు 24
ఆలోచింపజేసే కథలు

సామాన్యశాస్త్రం -12
తరగతి గదిలోనూ తప్పని కుల వివక్ష

డాక్టర్ ఫీజులు భరించలేనంతగా పెరిగిపోయాయన్న మాట తరచూ వినిపిస్తూనే వుంటుంది. వాస్తవానికి వైద్యం ఇప్పుడు ఒక 'పరిశ్రమ'గా మారిపోయింది. రోగులు... వారి బాగోగులు...అన్నీ పక్కకు పోయాయి. లాభార్జనే ప్రధానమైపోయింది. ఇలాంటి వాతావరణంలో సైతం ప్రజాసేవ చేయాలన్న సంకల్పం గుండెల నిండుగా వున్న వారూ వున్నారు. వారిలో డాక్టర్ **విజయలక్ష్మి దేష్‌మనే** ముందు వరుసలో వుంటారు. కర్నాటక మురికివాడలో చెప్పులు కుట్టేవారి కుటుంబంలో జన్మించిన ఆమె... పొట్ట కూటి కోసం కూరగాయలమ్మారు. తండ్రి కోరిక మేరకు పట్టుదలతో వైద్య పట్టా పుచ్చుకుని ప్రతిష్ఠాత్మక కిద్వాయ్ హాస్పిటల్ డైరెక్టరుగా, ఆంకాలజీ విభాగాధిపతిగా పని చేసి రిటైరయ్యారు. ప్రస్తుతం సామాజిక కార్యక్రమాలతోపాటు నిరుపేదలకు వైద్యం అందించే పనిలో వున్నారు. ఆ 'విజయ'గాథ ఆమె మాటల్లోనే ...

కూరగాయలమ్మిన చేత్తోనే క్యాన్సర్ చికిత్స చేస్తోంది

మాది కుల్బర్గ. కర్నాటకలో అత్యంత వెనుకబడిన ప్రాంతం. పాత చెప్పులు మరమ్మతు చేసి అమ్మే మాదిగ కులం మాది. నాన్న బాబూరావు మీద స్వాతంత్ర్యోద్యమ ప్రభావం బాగా వుండేది. ఆయన చదువుకోకపోయినా కుల, వృత్తిపరమైన కంచెలను ఛేదించి... స్వంతంగా కన్నడ, మరాఠీ, హిందీ, ఇంగ్లిష్ అక్షరాలు నేర్చుకున్నారు. నేను 1955వ సంవత్సరంలో ... ఆరుగురు అక్కలు, ఓ అన్నయ్య తర్వాత పుట్టాను. ఓ చిన్ని ఇంట్లో మేం పదిమందిమి. ఆ ఇల్లు కూడా మా మేనత్తది.

మాకు ఒక్క పూట భోజనం దొరకడమే కష్టంగా వుండేది. ఇక కనీస అవసరాలు కలలో మాటే. కట్టెలు కొట్టడం, మోయడం, అమ్మడం, కూలికెళ్లడం వంటి రకరకాల పనులు చేసేవారు అమ్మానాన్నా. తర్వాత నాన్న ఒక మిల్లులో చేరి అంచెలంచెలుగా ఎదిగారు. ఆయన కలివిడి స్వభావం అందుకు బాగా ఉపయోగపడింది. మిల్లులో ఆయనను ప్రేమగా దేష్‌మాన్య అని పిల్చేవారు. అదే తన ఇంటిపేరుగా మార్చుకున్నారు నాన్న. నెహ్రూగారి చెల్లెలు విజయలక్ష్మి పండిట్ పేరు నాకు పెట్టారు. అలా నేను విజయలక్ష్మి దేష్‌మానె అయ్యాను.

నాన్నకో స్వప్నం వుండేది. నేను వైద్య విద్య చదవాలని, నిరుపేదలకు సేవ చేయాలని కోరుకునేవారు. దళిత మహిళలు బడికి వెళ్లి చదువుకోవడం గురించి కలలో కూడా ఊహించలేని రోజుల్లో... నన్ను స్కూల్లో చేర్చారు. పిల్లల భవిష్యత్ పట్ల ఆయనకున్న ముందు చూపుకు ఇదో ఉదాహరణ. ఇలావుండగా మా అమ్మ కూరగాయల దుకాణం పెట్టింది. హోల్‌సేల్‌గా కూరగాయలు కొని అమ్మేది. దానిమీద వచ్చే కొద్దిపాటి లాభాలతోనే కుటుంబం నడపాల్సి వచ్చేది. అమ్మకు సాయంగా వుండేందుకు అన్నయ్య, నేను నెత్తిమీద కూరగాయల బుట్టలు మోసేవాళ్లం. చదువులో చాలా చురుగ్గా వుండేదాన్ని. అయితే పన్నెండవ తరగతి పరీక్షలు రాశాక ... అంతటితో నా చదువుకు ఫుల్‌స్టాప్ పడుతుందనుకున్నా. నాతో పాటు... అమ్మానాన్నా నా తోబుట్టువుల చదువు గురించి కూడా ఆలోచించాలి కాబట్టి... వాళ్లు నా కోసం అంతకు మించి ఖర్చు చేయలేరనిపించింది.

ఆ రోజు రాత్రి అమ్మ తనకున్న ఒక్కగానొక్క నగ... తన మంగళసూత్రాన్ని తీసి నాన్నకిచ్చింది. దానిమీద అప్పు తీసుకొని... హుబ్లీ లోని కె.ఎం.సిలో ఎం.బి.బి.ఎస్ ప్రవేశ పరీక్ష ఫీజు కట్టాం. ఇవాళ నేను ఈ స్థాయిలో వున్నానంటే ... తల్లిదండ్రులు, తోబుట్టువులు చేసిన త్యాగాల వల్లే. వాటిని నేను ఎప్పటికైనా తీర్చగలనని మాత్రం అనిపించడంలేదు!

డా॥ విజయలక్ష్మి

మెడిసిన్‌లో చేరక ...!

అప్పటి వరకు నేను కన్నడలో చదువుకున్నా. కానీ వైద్య విద్య ఇంగ్లిష్‌లో వుంది. భాషా సమస్య ఒకటైతే... నాకు అవసరమైన తెల్ల కోటు కూడా కొనుక్కోలేని స్థితి. తాత్కాలికంగా ల్యాబ్ అసిస్టెంట్ పాత కోటు అడిగి తీసుకున్నా. తర్వాత నా సీనియర్ విద్యార్థి తన స్టైఫండ్ ఇవ్వడంతో కొత్త కోటు కొనుక్కోగలిగాను.

ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు అర్థమైనా....పరీక్షలు ఇంగ్లిష్‌లో వుండడం వల్ల మొదటి సంవత్సరం ఫెయిలయ్యాను. అయితే ఆ మరుసటి ఏడాది చక్కగా పుంజుకుని...యూనివర్సిటీలోనే మొదటి ర్యాంకు సాధించాను. అందుకు మా గురువులకు ధన్యవాదాలు చెప్పుకోవాలి. ఈ వార్త తెలిసి మా ఇంట్లో పెద్ద పండగే చేసుకున్నారు. అయితే అప్పుడు కుటుంబ ఆర్థిక పరిస్థితి ఎలా వుందంటే...ఇంటి పైకప్పు కూలిపోయేలా వుంది.

రొమ్ము క్యాన్సర్‌లో స్పెషలైజేషన్ చేశాను. ఎం.ఎస్ తర్వాత కిద్వాయ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీలో చేరాక... నేనూ సంపాదించసాగాను. మా అన్నయ్య అజయ్ ఘోష్ (బెంగాలీ స్వాతంత్య సమర యోధుడు స్ఫూర్తితో పెట్టిన పేరు) ఎల్ఎల్‌బి పూర్తి చేసి ప్రాక్టీస్ ప్రారంభించాడు. ఎట్టకేలకు మా ఇంటి పైకప్పుని బాగు చేయించే సమయం వచ్చిందప్పుడు!

నా కెరీర్ మొత్తంలో గురువులు, తోబుట్టువులు, రోగుల నుంచి చక్కటి మార్గదర్శకత్వం, మద్దతు, ప్రేమ పొందిన అదృష్టవంతురాలిని. నేను చేపట్టిన వైద్య వృత్తిని ప్రేమిస్తాను. స్థిరంగా నేర్చుకోవాలన్న మాటను విశ్వసిస్తాను. రోగులతో మాట్లాడుతూ గట్టి బంధాన్ని ఏర్పరచుకుంటాను. సుదీర్ఘకాలం పని చేసి ఈ ఏడాదే రిటైరయ్యాను. కానీ నేను చెయ్యాల్సింది సగమే పూర్తయ్యిందనిపిస్తుంది. నెలకు పదిహేను రోజులపాటు... సామాజిక, ఆరోగ్య అవగాహనా కార్యక్రమాలు, పరిశోధనలు, గ్రామాల్లో విద్యా వ్యాప్తి కార్యక్రమాల కోసం కేటాయిస్తే... తతిమ్మా పదిహేను రోజులను కర్నాటక క్యాన్సర్ సొసైటీలో అందుబాటులో వుండి పేదలకు ఉచిత వైద్యం చేస్తున్నాను.

జర్మనీలో ప్రపంచంలోనే అతి ప్రాచీనమైన ఓ పేదల కాలనీ ఉంది. అది 500 ఏళ్ల నాటిది. చరిత్ర మలుపుల్ని చూసింది. దిగ్భ్రమ ఘటనలకు సాక్షి అయ్యింది. ఇదంతా ఒక ఎత్తు అయితే ఈ ధార్మిక నివాస సముదాయం అద్దె తీరు ఒక ఎత్తు. ఆగ్స్‌బర్గ్ నగరంలో పేదవాడికి గూడు కల్పిస్తున్న ఫుగ్గెరీ వాడలో ఇంటి అద్దె ఏ మాత్రం పెరగలేదు. అదీ ఏడాదికి దగ్గర దగ్గర ఎనభై రూపాయలే.



పురాతన వాడ

కారమెల్ రంగులో, పచ్చని గార్డెన్లు, చూపుతిప్పనివ్వని ఫౌంటెయిన్లతో 16వ శతాబ్ది నాటి వింటేజీ కళతో మైమరిపించే ఇళ్ల కట్టడాలతో ఓ పర్యాటక ప్రాంతంగా కనిపిస్తుంది ఫుగ్గెరీ. చాలా ప్రశాంత వాతావరణంతో ఆహ్లాదపరిచే ఆ ప్రాంతం నిజానికి.. పేదల కోసం కట్టి వారి కోసమే నడపబడుతున్న ధార్మిక కాలనీ. దీన్ని చూసేందుకు పర్యాటకులు ఎక్కడెక్కడి నుంచో వస్తుంటారు. ప్రత్యేకించి గైడ్‌లను పెట్టుకుని దాని విశేషాలు తెలుసుకుంటారు. ఏడాదికి రెండు లక్షల మంది సందర్శించే ఈ వాడ నిరుపేదలది అంటే అస్సలు నమ్మశక్యం కాదు. రోజు కూలీలు, కొవ్వొత్తి తయారు చేసి పొట్ట నింపుకునేవారి కుటుంబాలకు ఆశ్రయం కల్పించేందుకు జాకబ్ ఫుగ్గెరీ అనే ధనికుడు నిర్మించిన వాడ ఇది. వెండి, రాగి గనులు, బ్యాంకింగ్, సుగంధ ద్రవ్యాలు, రియల్ ఎస్టేట్, నేత మిల్లులు వంటి రంగాల్లో వ్యాపార దిగ్గజంగా ఎదిగిన ఫుగ్గెరీ దాతృత్వ విషయాల్లోను ముందుండే వాడు. అప్పటి ప్రపంచ రాజకీయ,

సామ్రాజ్య, వ్యాపార, ధార్మిక శక్తులతో అతి చనువుగా తిరిగిన ఆయన తన పేరిట ఈ వాడను నిర్మించి పేదలకు అంకితమిచ్చాడు. 1514-23ల మధ్య పూర్తయిన ఈ వాడలో నివాసముండే వారికి ఏడాదికి 1 రెనీస్ గుల్డెన్‌కు అద్దెకిచ్చాడు. అది 80 రూపాయల విలువ. ఇప్పటికీ ఇంతే మొత్తాన్ని అద్దె కడుతుంటారు వాడ వాసులు. తొలుత 52 కాటేజీలు, 106 అపార్ట్‌మెంట్‌లుగా కట్టించారు. తర్వాత అది విస్తరిస్తూ 140 అపార్ట్‌మెంట్‌లకు చేరుకుంది. ఫుగ్గెరీ పేరిట ఓ మ్యూజియాన్ని ఏర్పాటుచేశారు. కాలనీ తొలి జీవన శైలి నుంచి వచ్చిన అనేక మార్పులు చేర్పులు విశేషాలతో పాటు ఫుగ్గెరీ జీవితం, కుటుంబం గురించి ఎన్నో అంశాలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఒకప్పుడు ఓ స్కూల్ కూడా ఉండేది. కానీ తర్వాత నగరం విస్తరించడంతో వేరే బళ్లలో పిల్లల్ని చదివిస్తున్నారు. ఓ ఎత్తైన ప్రహరీతో మూసివేయబడిన ఈ వాడకు ఏడు గేట్లు ఉంటాయి. ఒక్క గేటు వద్ద సెక్యూరిటీ గార్డు ఉంటాడు. ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటికీ రాత్రి 10 గంటల కల్లా గేట్లు మూసేసి ఉదయం 5 గంటలకు తెరుస్తారు. వైద్యం వంటి అత్యవసర సమయాల్లో మాత్రం రాకపోకలకు అనుమతిస్తారు. నిర్ణీత వేళలు దాటితో ఫైన్ కట్టాలి. దొంగతనాలు, ఇతర అసాంఘిక కారణాల దృష్ట్యా ఈ జాగ్రత్త తీసుకున్నారు. దీనికి మరో కారణం కూడా ఉంది. ఫుగ్గెరీ సమయపాలనకు చాలా విలువనిస్తాడు. వాడ సింహద్వారంపై ఆయన రాయించిన 'కార్పె డైమ్' అనే మాట అర్థం సమయాన్ని సద్వినియోగం చేసుకోండనే. 500 నుంచి 700 చదరపు గజాలుండే ఈ అపార్ట్‌మెంట్లు ఒక పడక గది, వంట గది, విరామ గది, స్నానాల గదితో ఓ కుటుంబ అవసరాలను చక్కగా తీరుస్తాయి. నివాసకుల్ని ఆహ్లాదపరిచేలా కింది అంతస్తువారికి చక్కటి పెరడుని, పై అంతస్తు వారికి తీరైనా యాట్టిక్‌ను ఏర్పాటు చేశారు.

1880లో ఒకసారి, 1938లో ఒకసారి ఈ వాడను విస్తరించారు. అయితే రెండో ప్రపంచ యుద్ధ సమయంలో 1944 ఫిబ్రవరి 25,26న ఇది తీవ్రంగా దెబ్బతింది. చాలామంది ప్రాణాలు నిలబెట్టుకునేందుకు ఈ వాడలోనే ముందు జాగ్రత్తగా ఏడాది ముందే తవ్విన బంకర్‌లో తలదాచుకున్నారు. ఆ తర్వాత ఈ బంకర్‌నే మ్యూజియంగా మలిచారు. పదకొండేళ్ల తర్వాత 1955లో యథాతథంగా తిరిగి పునర్నించారీ వాడను. ఆ తర్వాత ఆధునిక హంగులు, వసతులను చేకూర్చినా ఒకప్పటి శోభను ఏమాత్రం కోల్పోకుండా జాగ్రత్త తీసుకున్నారు. సందర్శకులకు ఈ వైవిధ్యం తేలిగ్గా తెలిసేందుకు 13 మిట్లెరి వీధిలో ఒక ఫ్లాట్, 51 ఓచెన్‌గాస్సెలో ఒక ఫ్లాట్‌ను సందర్శనార్థం ఉంచారు. మిట్లెరిలోనిది 16వ శతాబ్ది ఆవాసానికి ప్రతిరూపం, ఓచెన్‌గాస్సెది ఫుగ్గెరీ కుటుంబం గూర్చి వివరించే డాక్యుమెంటరీ హౌజ్. అప్పటి ప్రత్యేకత తెలిపేలా ఇప్పటికీ ఇనుప గంటల వ్యవస్థ కనిపిస్తుంది. చీకట్లో ఎవరి ఫ్లాట్ తలుపు తడుతున్నారో తెలుసుకునేలా ఒక్కోటి ఒక్కో ఆకారం, రీతిలో ఉంటాయవి. మ్యూజిక్ మాంత్రికుడు మొజార్ట్ తాత ఇక్కడ 16 ఏళ్లపాటు నివసించాడు. ఇక్కడ మంత్రగత్తె అన్న అనుమానంతో ఓ మహిళ తల నరికి దహనం చేశారు కొందరు మూర్ఖులు. వ్యాపారాల్లో పడి నలభై ఏళ్లకు పెళ్లి చేసుకున్న ఫుగ్గెరీ భార్యతో సఖ్యత లేక పిల్లలు కూడా కలగలేదు. తన తర్వాత తన గురించి ఆలోచించేవారుంటారా అని అనుకున్న ఫుగ్గెరీ వాడ వాసులను ఓ కోరిక కోరాడు. రోజూ మూడు సార్లు తన గురించి ప్రార్థించాలని విన్నవించాడు. ఇప్పటికీ ఫుగ్గెరీ పేరిట ఆ ప్రార్థనలు వినిపిస్తూనే ఉంటాయి. ఫుగ్గెరీ అభీష్టానికి అనుగుణంగా అతడి తోబుట్టువుల వారసులు ఇంకా ఈ వాడ మంచి చెడులు చూసుకుంటూనే ఉన్నారు. ✦





యాప్ టీచర్ ఇమ్రాన్



ఇమ్రాన్ ఖాన్! ఇవాళ దేశమంతటా ఈ పేరే వినిపిస్తోంది. టీవీల్లో, పత్రికల్లో ప్రత్యేక కథనాలు, వార్తలు ప్రచురితమౌతున్నాయి. ఆయనకు సంబంధించిన సమాచారం కోసం అంతర్జాలంలో అన్వేషించేవారి సంఖ్య అంతకంతకు పెరిగిపోతోంది. ఇంతకీ ఎవరీ ఇమ్రాన్ ఖాన్! ఒక్కసారిగా ఇంతటి ఘనత ఎలా సాధించారు? ఆయన ప్రత్యేక ఏంటి?

రాజస్థాన్‌లో ఎక్కడో మారుమూల గ్రామమైన అల్వార్‌లో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఇమ్రాన్‌ఖాన్. ఇతను విద్యార్థులకు ఉపయోగపడే యాభైకి పైగా యాప్‌లు సృజించడమే ఆయన ప్రత్యేకత. అంతేకాదండోయ్. ఈమధ్య మన ప్రధాని మోడీ సైతం ఆయనను ప్రశంసించారు.

ఓనమాలు తెలియకుండానే ...

ఇమ్రాన్ కంప్యూటర్ సైన్స్‌లో ఓనమాలైనా దిద్దలేదు. అతనికి గణితం బోధించడమంటే ఇష్టం అంతే. అలాంటి ఓ మామూలు టీచర్ చేసింది సామాన్యమైన పని కాదు. కేవలం మూడేళ్లలో ఒకటి రెండు కాదు ఏకంగా 52 మొబైల్ అప్లికేషన్లు రూపొందించి... అన్నింటినీ విద్యార్థులకు ఉచితంగా అందుబాటులో ఉంచారు. ఇందుకోసం ఇమ్రాన్ ఖాన్ కృషి చాలా చిత్రంగా మొదలైంది. కంప్యూటర్ టెక్నాలజీ చదువుకోని ఆయన కంప్యూటర్ సైన్స్‌లో బి.టెక్ చేసిన తన సోదరుడు... ఇంట్లో వదిలివెళ్ళిన కంప్యూటర్ ముందే ఎక్కువ సేపు గడుపుతుండేవారు. అంతేకాకుండా సోదరుడి పుస్తకాలు చదువుతుండేవారు. హెచ్.టి.ఎం.ఎల్. లాంగ్వేజ్ నేర్చుకున్నారు. స్వయంగా ఉపాధ్యాయుడైన ఇమ్రాన్ ఖాన్ కు 'గూగుల్' గురువు అయ్యింది. అలా ఆయన వెబ్‌సైట్ రూపకల్పన చేశారు. ఒకటి, రెండు కాదు. అనేక రకాల వెబ్‌సైట్లను రూపొందించారు. ఇది ఇలా ఉండగా, ఒకసారి 2012లో, అల్వార్ జిల్లా కలెక్టర్ పడ్నీకర్ ను కలిశారు. అప్పుడు ఇమ్రాన్‌లోని ఆసక్తిని గమనించడమే కాక, ఆయన తయారుచేసిన వెబ్‌సైట్ చూసిన కలెక్టర్ ఒక సలహా చెప్పారు. 'రాబోయే రోజులన్నీ మొబైల్ యాప్స్‌వే. వాటిని డెవలప్ చేస్తే బాగుంటుంది' అన్నారు. ఆ మాట ఇమ్రాన్‌కు మార్గదర్శకమైంది.

అప్పటికి యాప్ అనే మాట కూడా ఇమ్రాన్‌కు తెలియదు. కలెక్టరే తన దగ్గరున్న ట్యాబ్లెట్‌లో కొన్ని యాప్స్ చూపెట్టారు. దానితో యాప్స్ చేయాలనే ఆలోచన వచ్చింది. ఇక యాప్స్ అభివృద్ధి చేయడం ఎలాగో ఆన్ లైన్ శోధించడం ద్వారా నేర్చుకున్నారు. దీని కోసం అనేక పుస్తకాలు చదివారు. ఆ చదివినదాన్ని ఆచరణలో పెట్టారు. సొంతంగా యాప్స్ డెవలప్ చేశారు. మొట్టమొదట 2012 లో 'లెర్న్ సైన్స్' అనే యాప్‌ను తన పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉపయోగపడే విధంగా రూపొందించారు. అది విజయవంతం కావడంతో ఆయన మొదలుపెట్టిన ప్రయాణంలో ఎక్కడ కూడా వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. జనరల్ నాలెడ్జ్, ఇంగ్లిష్ – ఇలా చదువుకు సంబంధించిన 52 యాప్స్ చేశారు. విశేషం ఏమిటంటే, వాటన్నింటినీ స్టూడెంట్స్‌కు ఆయన ఉచితంగా అందుబాటులో ఉంచారు. ఆ యాప్స్‌ను ఇప్పటికి 30 లక్షల మందికి పైగా యూజర్లు డౌన్‌లోడ్ చేస్తున్నారంటే అతిశయోక్తి కాదు. ఇప్పటి వరకు ఆయన ఏకంగా వందకు పైగా వెబ్‌సైట్లు సృష్టించారు. వాటిలో ఆయన నడుపుతున్న gktalk.com, gktalk_imran లాంటి వెబ్ సైట్లు చాలా పాపులర్ అయ్యాయి.

“రాజస్థాన్ సరిస్కా టైగర్ రిజర్వు సరిహద్దు గ్రామంలో బాల్యం గడిపిన ఆయన తన ఇంటి నుండి పాఠశాలకు 10కి.మి దూరంలో ఉన్న పాఠశాలకు వెళ్లి చదువుకున్నారు. అనంతరం ఉన్నత చదువులు చదవడానికి అనేక కష్టాలను అనుభవించారు'మా అన్నయ్య మా కుటుంబ అబ్దుల్ కలాం' అంటాడాయన సోదరుడు ప్రశంసాపూర్వకంగా. ”

కుటుంబ నేపథ్యం

సామాన్య రైతు కుటుంబంలో ఏడుగురు తోబుట్టువుల మధ్య మూడవ వ్యక్తిగా జన్మించాడు ఇమ్రాన్ ఖాన్. రాజస్థాన్ సరిస్కా టైగర్ రిజర్వు సరిహద్దు గ్రామంలో బాల్యం గడిపిన ఆయన తన ఇంటి నుండి పాఠశాలకు 10కి.మి దూరంలో ఉన్న పాఠశాలకు వెళ్లి చదువుకున్నారు. అనంతరం ఉన్నత చదువులు చదవడానికి అనేక కష్టాలను అనుభవించారు. ఇంట్లో సరైన మౌలిక సౌకర్యాలు కూడా లేని ఆయన వైపు ....ఒక్కసారిగా యావత్ ప్రపంచం చూస్తుందంటే అతిశయోక్తి కాదు. 'మా అన్నయ్య మా కుటుంబ అబ్దుల్ కలాం' అంటాడాయన సోదరుడు ప్రశంసాపూర్వకంగా. ఇప్పుడు ఎన్నో అవకాశాలు ఆయనను వెతుక్కుంటూ వస్తున్నాయి. రాజస్థాన్ ప్రభుత్వం ఆయనకు 'సైన్స్ అండ్ టెక్నాలజీ' డిపార్ట్‌మెంట్‌లో ప్రాజెక్ట్ హెడ్‌గా నియమించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది.

- అనంతోజు మోహన్ కృష్ణ
8897765417.



అట్టమీద కథ

కొనిపించడానికి కొన్ని రోజులు

అమ్మ కోసం మదర్స్ డే, నాన్న కోసం ఫాదర్స్ డే, అమ్మమ్మ తాతయ్యల కోసం గ్రాండ్ పేరెంట్స్‌డే, ప్రేమికుల కోసం వాలెంటైన్స్ డే...ఈ జాబితా చాలా సుదీర్ఘమైనది. ఎవరికోసమైతే ఆ రోజును కేటాయించారో వారికి గిఫ్ట్ కొనిస్తే... మనకు వారి మీద ప్రేమ, అభిమానం వున్నట్టు. లేకపోతే... లేనట్టు...అన్న వాతావ రణం చుట్టూ పరచుకుందివాళ. ఆ రోజుల్లో వచ్చే ఏ వాణిజ్య ప్రకటన చూసినా లోపాయకారీగా తెలియ చెప్పేది అదే. నిజానికి ఈ రోజులన్నీ తమ పబ్బం గడుపుకోవడానికి వ్యాపారవేత్తలు సృష్టించినవే. అవన్నీ వాళ్లు తయారు చేసిన ఉత్పత్తులను కొనిపించడానికి కొన్ని రోజులు. అంతే.

- రవి కిరణ్

రాహుల్ వాళ్ల మమ్మీతో గొడవ పడుతున్నాడు. "అబ్బా! ఒక్క రెండు వేలేనే. డాడీకి ఏమైనా సరే వాచీ గిఫ్ట్‌గా ఇద్దాం" అన్నాడు. "ఎందుకురా.. ఐదొందల్లో ఏదైనా వాలెట్ కొనిద్దాంలే" అంది మమ్మీ. "అమ్మా... ఫాదర్స్ డే! తండ్రుల దినోత్సవం. ఇప్పుడు కూడా డబ్బులు లెక్కలేస్తావేంటి?" కోపంగా అరిచాడు రాహుల్. ఇంతలో "ఒరేయ్ అబ్బీ.. దినాలకు మనం వెళ్లకూడదురా.. పెద్దమ్మ ఇంట్లో వారంలోనే పెళ్లి ఉందిగా" అరిచింది నాయనమ్మ. "అబ్బా... దినమంటే ఆ దినం కాదే.. ఫాదర్స్ డే" అన్నాడు రాహుల్. "అంటే" అడిగింది ముసలమ్మ. రాహుల్‌కు ఏం చెప్పాలో తెలియలేదు. ఫాదర్స్ డే వస్తే గిఫ్ట్ కొనివ్వాలని తెలుసు కాని... ఎందుకో... ఏమిటో తెలియదు మరి.

ఇది ఇప్పుడు ప్రతి కుటుంబంలో ఏదో ఒక సందర్భంలో కనిపించే సన్నివేశమే. సేల్స్ కోసం సాలీడుల్లా సాలెగూడును నిర్మించి మరీ.. అందులో కుటుంబాలను ఇరికించేస్తున్నారు వ్యాపారస్తులు. ఆత్మీయ అనుబంధాల పేరుతో సాగే ఈ వ్యాపారంలో.. ప్రేమకు విలువ కడుతున్నామనే సంగతి కూడా మర్చిపోయి.. అందరూ పావుల్లా మారిపోతున్నారు. ఫాదర్స్‌డే రోజు గిఫ్ట్ కొనిచ్చి.. మిగిలిన రోజుల్లో నాన్న మాట వినకుండా గొడవపడ్డా..ఎదురు తిరిగినా సరిపోతుందనే లెక్క నడుస్తోంది. మదర్స్‌డే ఒక్క రోజు అమ్మపై ప్రేమ కురిపించి.. తర్వాత పట్టించుకోకపోయినా 'చల్‌తా హై' అనుకుంటున్నారు.

ఎన్ని 'డే'లో...

రోజూ అరేయ్ ఒరేయ్ అనుకునే కుర్రాళ్లు కూడా.. ఫ్రెండ్‌షిప్‌డే వచ్చిందంటే ఏదో అప్పుడే పరిచయమైనవారిలా 'హాయ్! హ్యాపీ ఫ్రెండ్‌షిప్ డే' అంటూ శుభాకాంక్షలు చెప్పుకుంటారు. కష్టాలొచ్చినప్పుడు మొహం చాటేసినవాళ్లు కూడా ఆ రోజు ఫోన్ చేసి మరీ గ్రీటింగ్స్ చెబుతారు. స్నేహాన్ని పంచని ఈ-స్నేహితులు ఎంతమంది ఉన్నా ఉపయోగమేముంది?! కష్టమొచ్చినప్పుడు ఆదుకునే ఫ్రెండ్స్‌కు ఈ ఫ్రెండ్‌షిప్‌డే ఎప్పుడో కూడా గుర్తుండదు. ఎందుకంటే వారికి రోజూ ఫ్రెండ్‌షిప్‌డే నే.

క్రిస్టమస్.. ఆ తర్వాత న్యూ ఇయర్.. ఆ పైన వాలెంటైన్స్ డే, సింగిల్స్ డే...ఇలా శీతాకాలం మొత్తం బిజినెస్ దుమ్ము లేపేస్తాయి కంపెనీలు. అమెరికా, యూరప్ దేశాల్లో ఈ రోజుల్లోనే సెలవులు ఇస్తారు. సెలవులు, ఫెస్టివల్ మూడ్‌లో ఉన్నప్పుడే షాపింగ్ చేస్తారు కాబట్టి.. క్రిస్టమస్, జనవరి ఫస్ట్‌కు భారీ ప్రచారంతో ఆకర్షించే ప్రయత్నం చేస్తారు.

చివరికి 'న్యూ ఇయర్‌కు పార్టీ చేసుకోకపోతే జీవితం వేస్ట్' అనే వరకూ తీసుకొచ్చారు.

లెక్కలేనన్ని సందర్భాలు

పశ్చిమ దేశాల్లో అయితే సందర్భాన్ని సృష్టించాలి. కాని మన దగ్గర ఆ అవసరమే లేదు. బోలెడన్ని పండగలు.. లెక్క లేనన్ని ఆచారాలు.. తట్టుకోలేనన్ని సంప్రదాయాలు ఉన్నాయి. ఎంచక్కా .... మన తెలుగు పండగలు చేసుకుంటాం. అవి చాలవన్నట్టు నార్త్ వాళ్ల జరుపుకునే హోలీ కూడా ఆడేస్తాం. సంక్రాంతితో మొదలై.. ఉగాది, శ్రీరామనవమి, దసరా, దీపావళి వరకు నాన్‌స్టాప్ సందడే. ఇవన్నీ కాక మళ్లీ అరువు తెచ్చుకున్న ఇంగ్లీషు పండగలు 'న్యూ ఇయర్' లాంటివి ఉండనే ఉన్నాయి. పిల్లలు సెలవుల కోసం చూస్తే.. అందరూ కొత్త బట్టల కోసం ఆశపడితే.. ఇప్పుడు గిఫ్ట్‌ల కోసం ఎదురుచూస్తుంటే.. ఖర్చు పెట్టాల్సిన పెద్దమనిషి మాత్రం డబ్బుల కోసం వెతుక్కుంటున్నాడు. పండగలకు అల్లుళ్లకు.. రాఖీ వస్తే చెల్లెళ్లకు.. హోలీ వస్తే బావామరదళ్లకు, ఏదొచ్చినా పిల్లలకు ఏదో ఒకటి కొనివ్వాల్సిందే. బిల్లు కొనేవాడికి..థ్రిల్లు అమ్మేవాడికి.

అక్షయ తృతీయ వస్తుందంటే చాలు.. కొందరి గుండెల్లో రైళ్లు పరిగెడతాయి. అసలా యాడ్ టీవీలో వస్తుంటే టక్కున రిమోట్‌తో చానెల్ మార్చేస్తారు. ఎందుకంటే లైఫ్ పార్టనర్ ఎక్కడ చూస్తారో.. చూశాక అడిగి .. అది సాకారం కాకపోతే అలుగుతారేమోనని భయం. ప్రకటనల్లో మోడల్స్ బంగారం సింగారించుకుని ముచ్చటగా కనపడుతుంటే.. మనసు చివుక్కుమంటుంది. 'ఒక్క గ్రాము అయినా కొనకపోతిరే' అంటూ రాగాలు తీస్తారు. ఈ రాగాలతో ఉన్న అనురాగం కూడా మౌనరాగం ఆలపిస్తుంది. కోర్టులో ముద్దాయిలా తల దించుకుని.. ఆ ఎపిసోడ్ ఎప్పుడు ముగుస్తుందా.. వాళ్ల బంగారం టాపిక్ ఎప్పుడు వదిలేస్తారా అని ఎదురు చూడడం మినహా మరో మార్గం వుండదు.

ఇక యూత్ గురించి చెప్పనక్కర్లేదు. చాటింగ్‌తో మొదలెడతారు... ఒక గ్రీటింగ్ ఇస్తారు.. దాంతో పాటు కళ్లు తిరిగిపోయేలా ఐటెమ్స్ బహుమతులుగా ఇస్తారు. ఆ తర్వాత మంచి మీటింగ్.. ఫుల్ ఈటింగ్... వర్కవుట్ అయితే డేటింగ్. ఈ దశలన్నీ దాటేటప్పటికీ అయ్యగారికో..అమ్మగారికో ఖర్చు వాచిపోద్ది. వాలెంటైన్స్ డే వచ్చినా ఖర్చులే.. ఫ్రెండ్‌షిప్ డే వచ్చినా ఖరీదైన అనుభవమే.. ఇక తెలుగు, ఇంగ్లీషు, హిందీ పండగ ఏదైనా.. రూపం మారుతుంది గాని.. ఖర్చు రూపం మాత్రం అదే.

సందర్భం ఏదైనా.. సంగతులెన్ని చెప్పినా.. సమ్‌థింగ్ కొనకపోతే మాత్రం ఆ పండగ ఇక రంగు రుచి వాసన లేని శాకంలా అనిపిస్తుంది. పొరపాటున షాపింగ్ చేయలేదో.. ఒక్కొక్కళ్లు పంచ్ ఫలక్‌నామాల అవతారం ఎత్తుతారు. ఇక బతుకు అంధకార బంధురం అయిపోయినట్లు...

ఇలాంటి జీవితం కూడా ఒక జీవితమేనా అన్న డైలాగులూ వస్తాయి. 'ఏదో ఒకటి కొనేస్తే ఇంట్లో అందరం ప్రశాంతంగా వుండొచ్చు లేకపోతే చచ్చామే' అనిపిస్తుంది. అంతలా జనం మైండ్‌సెట్ మార్చేశారు.

ట్రెండు మార్చేశారు

మొదట్లో ఈ ట్రెండ్ అవసరాలు తీర్చుకోవడానికి పనికొచ్చేది. అంటే వాచీ లేనివారికి ఒక సందర్భంలో అది కొనిస్తే.. అవసరం తీరుతుంది.. అభిమానం చూపించినట్లు ఉంటుంది. అలాగే వెహికల్ లేనివారికి అది ఇవ్వడం.. ఫోన్ లేని వారికి మొబైల్ కొనివ్వడం.. ఇలా ఏ వస్తువు లేదో అది కొనిచ్చి అభిమానం చాటి చెప్పుకునేవారు. కాని ఇప్పుడు ఈ ట్రెండ్ మారిపోయింది. కొత్త ట్రెండ్ ఏంటంటే కొత్తవి కొనటం అనేకంటే కొనిపించడం అని చెప్పుకోవచ్చు. అంటే అప్పటికే ఉన్న వస్తువును వదిలేసి.. కొత్తది

కొనడం. మొదట్లో వస్తువు పాడై రిపేరు వస్తే.. దాన్ని మార్చేసి కొత్తదిచ్చి మురిసిపోయేవారు. ఇప్పుడు మాత్రం ఆ వస్తువు బాగున్నా సరే.. మార్కెట్లో కొత్త మోడల్ కొనుక్కోవడం. అంటే మొబైల్ ఉన్నది పని చేస్తున్నా.. స్మార్ట్ ఫోన్ వస్తే అది గిఫ్ట్‌గా పడాల్సిందే. లేదంటే ఇవ్వాల్సినవారికి భగవద్గీత వినిపిస్తుంది. మామూలు ఫోన్ ఉంటే టచ్ స్క్రీన్.. అదీ ఉంటే స్మార్ట్ .. అది కూడా ఉంటే 3జి.. ఇప్పుడు కొత్తగా 4జి.. అలా టెక్నాలజీ అప్‌డేట్ అవుతున్న కొద్దీ.. కొత్త కొత్త ప్రొడక్టులు మార్కెట్లోకి వచ్చేసి మనకు లైనేస్తుంటాయి. అది ఐ మూలగా చూసిందంటే మనం పడిపోక తప్పదు. కొనేయకా తప్పదు. అలాగే కార్లు, కంప్యూటర్లు, బట్టలు, ఫర్నిచర్... ఒకటేమిటి అన్నీ. లేటెస్ట్‌గా ఏదొస్తే అది మన చేతిలోనో, ఇంట్లోనో ఉండాలి. లేదంటే మనం చాలా వెనకబడిపోయినట్లే అన్న వాతావరణాన్ని సృష్టించేశారు.

గిఫ్ట్‌లు కొనకపోతే పరువు తక్కువ.. ఖరీదైనవి ఇవ్వకపోతే చిన్నతనం.. అప్పు చేసినా అదిరిపోయే గిఫ్ట్ ఇస్తే అది గొప్ప. వాటిని వాడేది తక్కువే. కాని ఆ క్షణం.. ఆ కాసేపు... వారి మొహంలో మెరుపులు కనిపిస్తాయి. లేకపోతే అదే మొహం నల్లగా మాడిపోతుంది మరి!

వాళ్లు పుట్టించినవే

వినిమయదారీతత్వాన్ని ప్రజలకు అలవాటు చేయడానికి కార్పొరేట్ కంపెనీలు పడని పాట్లు లేవు. సాంప్రదాయకంగా పుట్టుకొచ్చిన కొన్ని రోజులను వీరు వ్యాపారానికి వాటంగా మార్చేసుకున్నారు. ఇక కొన్ని అయితే వీరే డిజైన్ చేసి మరీ మార్కెట్‌పైకి వదిలిపెట్టినవే.

అసలు ఈ రోజులు ఎలా పుట్టాయో తెలుసుకుంటే ఆశ్చర్యంగా ఉంటుంది. మదర్స్ డే 1909లో మొదలైతే ఫాదర్స్ డే 1910లో పుట్టింది. ఒకానొక కుటుంబంలో వారి తల్లిదండ్రులకు గౌరవం ఇవ్వాలని అనుకున్నప్పుడు..వారు అనుకున్న రోజునో లేక అమ్మానాన్నల పుట్టినరోజునో సెలెబ్రేట్ చేసుకున్నారు. సెలెబ్రేషన్‌కు టైమ్ కుదరక జూన్ మూడవ ఆదివారం ఫంక్షన్ చేసుకున్నందుకు.. ఇప్పుడు ప్రపంచమంతా జూన్ మూడవ ఆదివారం ఫాదర్స్ డే జరుపుతున్నారు. భారత్‌కు స్వాతంత్ర్యం

ఇవ్వాలని ఆగస్టు 14 అర్ధరాత్రి దాటాక గాని బ్రిటీష్‌వాడికి అనిపించలేదు. వాడికా ఫీలింగ్ రావడానికి ఆ సమయం పట్టింది. ఇక ఆగస్టు 15 మనకు స్వాతంత్ర దినోత్సవం అయిపోయింది. ఇవి కూడా అంతే. వాలెంటైన్స్ డే కూడా 4వ శతాబ్దంలోనే ఓ సెయింట్ తన ప్రేయసితో పండగ జరుపుకుంటే అదే ప్రత్యేక రోజుగా మారిపోయింది. ఫిబ్రవరి 14నే చేసుకోవాలని అతనికి మనసు పుట్టింది.. టైమ్ కుదిరింది. అంతే ఆ రోజే వాలెంటైన్స్‌డే గా మారిపోయింది.

ఇవన్నీ ఇప్పుడే ఎందుకింత ఫేమస్ అయిపోయాయి? జనం ఎందుకింతలా వీటి చుట్టూ తిరుగుతున్నారు? అంటే సమాధానాలు చాలా వస్తాయి. మనం జాగ్రత్తగా గమనిస్తే షాపింగ్ మాల్స్ సంస్కృతి వచ్చాకే.. ఈ ప్రత్యేక రోజులు దర్శనమివ్వ సాగాయి. గతంలో అమెరికా, యూరప్ దేశాల్లోని కంపెనీలు తమ వస్తువులు అమ్ముడు పోకపోతే.. వాటిని కొనిపించడానికి ఏదో ఒక సందర్భం సృష్టించడం మొదలెట్టారు. గర్ల్‌ఫ్రెండ్‌ను ఇంప్రెస్ చేయడానికి బర్త్‌డే డేట్ కూడా మార్చేసి పార్టీ ఇచ్చినట్లే ఈ వ్యవహారం ఉంటుంది. చరిత్రలో నమోదైన ప్రత్యేక సందర్భాలను వెలికి తీసి మరి.. వాటికి ప్రచారం కల్పించి.. తెలియనివాళ్లకు తెలిసేలా చేసి.. అదొక స్పెషల్ అన్నట్లు వారి బుర్రల్లోకి ఎక్కించే పని మొదలెట్టారు. అది వారికి వర్కవుట్ అయింది. అలా మొదలైన కల్చర్.. వస్తువుల ఉత్పత్తి పెరిగిన కొద్దీ పెరిగిపోయింది.

ఆయా దేశాల్లో ఆర్థిక సంక్షోభాలు వచ్చినప్పుడు.. ప్రజల కొనుగోలు శక్తి పడిపోయి.. అమ్మకాలు ఆగిపోతుండేవి. అప్పుడు ఉత్పత్తి చేసిన వస్తువులు ఏం చేసుకోవాలో తెలియక కంపెనీల యాజమాన్యాలు తలలు పట్టుకునేవి. మొదట డిస్కౌంట్లు, ఆఫర్లతో ప్రయత్నించేవి. పోనుపోను అవి కూడా ఫలితం ఇవ్వలేదు. అప్పుడే ఈ క్రియేటివ్ ఐడియాను సృష్టించారు. వినియోగదారుడికి లేని అవసరాన్ని సృష్టించడమే ఆ ఐడియా. అప్పుడే చరిత్రను తవ్వేశారు. ఎక్కడివో.. ఎప్పటివో పండగలు, ప్రత్యేక రోజుల వివరాలు వెలికి తీశారు. వాటిని అందంగా ముస్తాబు చేసి మార్కెట్‌లోకి తెచ్చేశారు. సెంటిమెంట్‌తో సొల్లు పురాణాలు చెప్పేసి.. వినియోగదారుల బుర్రల్లోకి వినిమయదారీతత్వాన్ని ఎక్కించేశారు. కాలేజీలు చదువుకుంటూనే పార్ట్‌టైమ్ జాబ్‌లు చేసి డబ్బులు తెచ్చుకునే యువత ఉన్న పశ్చిమ దేశాల్లో ఇది మరింత వేగంగా వ్యాప్తి చెందింది.

ఇక భారత్ లాంటి దేశాల్లో సాఫ్ట్‌వేర్ వంటి సర్వీసు రంగాలు అభివృద్ధి చెంది.. కొత్తగా ఒక ఉన్నత మధ్య తరగతి తయారైంది. వీరి దగ్గర కాస్త డబ్బులు చేతుల్లో ఆడుతుంటాయి. దీంతో మార్కెట్ పెరిగింది. సర్వీసు రంగంలో ఉన్నవారికి ఊరంతా తిరిగేంత టైముండదు. అందుకే ఆలోచించిన కంపెనీలు షాపింగ్ మాల్ ఐడియాను తెచ్చాయి. కొత్తగా పుట్టుకొచ్చిన రిచ్ క్లాస్‌కి.. ఇది బాగా సెట్ అయింది. అయినా ఖర్చు ఒక్కసారే ఎక్కువ పెట్టడం ఇష్టం లేనివారి కోసం మరో స్కీమ్ వచ్చింది. అది పాతాళభైరవిలా నరుడా ఏమీ నీ కోరిక అంటుంది. ఏది చెబితే అది తీర్చేస్తుంది. కాకపోతే ఇక్కడ మళ్లీ ఆ పాతాళభైరవి కోరికలను మనం తీర్చాలి. లేదంటే అది మాంత్రికుడి తల నరికినట్లు మన తల నరికేస్తుంది. అదే క్రెడిట్ కార్డ్. అవును అమ్మకాలు పెంచుకోవడానికి అప్పు ఇచ్చి మరీ ఖర్చు చేయించే అందమైన ఆయుధం. ఈ క్రెడిట్ కార్డులు ఎంత మంది జీవితాలను నాశనం చేశాయో... ఎందరి ప్రాణాలు తీశాయో మనం చూస్తూనే వున్నాం. క్రెడిట్ కార్డులే కాకుండా.. లోన్లు ఇచ్చేలా, ఫైనాన్స్ చేసేలా.. బ్యాంకింగ్ వ్యవస్థను కూడా ఈ కార్పొరేట్ ప్రపంచం తమ గుప్పిట్లోకి తెచ్చుకుంది. అర్హత ఉన్నా లేకపోయినా వస్తువు కొనిపించేయడానికి లోను ఇప్పించేయడం.. తమ పని ముందు కానిచ్చేసుకోవడం జరిగేది. ఆ లోను కట్టలేక.. రికవరీ వాళ్ల గొడవ తట్టుకోలేక.. అవమానంతో ఆత్మహత్యల వరకూ వెళ్తున్న కేసులు కనిపిస్తున్నాయి.

ఇక టెక్నాలజీ పరంగా కూడా వినిమయదారీతత్వాన్ని పెంచుతున్నారు. ఉదాహరణకు కంప్యూటర్ పరికరాలు రోజురోజుకి రేట్లు తగ్గుతాయి. కాని మిడిల్‌క్లాస్ సుబ్బారావు బడ్జెట్ మాత్రం మారదు. 20 వేలు పెట్టి సిస్టమ్ కొన్నా.. మళ్లీ సంవత్సరం తర్వాత కూడా అదే 20 లేదా కాస్త ఎక్కువ పెట్టి కొనుక్కోవాలి. ఇక్కడ మేజిక్ ఏంటంటే.. 20 వేలు ఉన్నది 10 వేలకు పడిపోతుంది. కాని అదే టైమ్‌లో హార్డ్‌డిస్క్, ప్రాసెసర్‌లాంటి వాటి కెపాసిటీలు పెంచేసి.. మళ్లీ అదే రేటుకు మార్కెట్‌లో పెడతారు. పైగా వీటిలో వేసే సాఫ్ట్‌వేర్ కూడా కొత్త టెక్నాలజీ ఉంటేనే వస్తానంటుంది. అప్‌డేట్‌గా మోడరన్‌గా పని జరగాలంటే సాఫ్ట్‌వేర్‌తో పాటు కంప్యూటర్ కూడా మార్చాల్సిందే. అంటే ఏడాదికొకసారి ఖర్చు పెట్టాల్సిందే. అదీ పరిస్థితి.

ఇలా అన్ని రకాలుగా పద్మవ్యూహంలోకి లాగేసి.. వినియోగదారులను అభిమన్యుల్లా

ఇరికించేసి.. వారు వ్యాపారం లాభాలతో లాగించేస్తున్నారు. వారి మార్కెటింగ్‌కు లొంగిపోయి పద్మవ్యూహంలోకి ఎంటరైపోతారు. తర్వాత ఎలా బయటపడాలో అర్థంకాక తికమకపడిపోతారు. స్పెషల్ ఫ్లేవర్ కోసం స్పెషల్ డేస్ అని పెట్టి సంవత్సరమంతా సీజనే అన్నట్లు.. ఫుల్ సేల్స్ నడిపించుకుంటున్నారు. జనం కూడా వినిమయదారీతత్వం ట్రాప్‌లో పడి.. సర్వం సమర్పయామి చేసేస్తున్నారు. ఇవి చాలవన్నట్లు ఇప్పుడు ఆన్‌లైన్‌లో మార్కెటింగ్ జోరుగా నడిపించేస్తున్నారు. నెట్ వచ్చి.. మౌస్ నొక్కితే చాలు.. వాడి అకౌంట్లోకి మన డబ్బులు.. మన ఇంటికి వస్తువులు వచ్చేస్తున్నాయి. ఈ వెబ్‌సైట్లు ముందు నుంచే ఏ పండగ ఏ రోజు వస్తుంది.. ఏ స్పెషల్ డే ఎప్పుడో జనానికి చెబుతూ అలర్ట్ చేసేస్తాయి. బడ్జెట్ సిద్ధం చేసుకోవడానికి వీలుగా ముందే మైండ్ ప్రిపేర్ చేసేస్తుంది. పైగా బంపర్ ఆఫర్లంటూ అదరగొట్టే ప్రచారం చేస్తుంది. ఇంకేముంది.. రికార్డు స్థాయిలో సేల్స్ నడిచిపోతున్నాయి.

ఇక విదేశాల్లో ఉద్యోగాలు చేయడం పెరిగాక.. తల్లిదండ్రులు ఇండియాలో.. ఉద్యోగాలు చేసుకుంటూ పిల్లలు అమెరికాలో ఉండటమనేది సాధారణమైపోయింది. వీరి కోసం కూడా కార్పొరేట్ కంపెనీలు తమ వెబ్‌సైట్లలో అందమైన ఆఫర్లు పెడతారు. మీరు అమెరికాలో ఉండి మాకు చెబితే చాలు.. మేము మీ ఊళ్లో ఉన్న అమ్మకో, నాన్నకో బర్త్‌డే గిఫ్ట్ అందిస్తాం అంటూ ఎంతో చక్కగా చెబుతారు. వారు చెప్పేదాంట్లోనే మీరు పేరెంట్స్‌ను వదిలేసి వచ్చేశారని అందంగా తిడతారు. అవును కదా అని మీ మనసుతో చెప్పిస్తారు. సెంటిమెంట్ రగిలిపోయి.. వెంటనే ఓ గిఫ్ట్ సెలెక్ట్ చేసి క్లిక్ కొట్టేస్తే.. రుణానుబంధం తీరిపోయినట్లే ఫీలయ్యేలా చేసేస్తారు.

ఏం కొనకుండా వుండేందుకు...

ఇలా మనుషుల అవసరాలతో నిమిత్తం లేకుండా బంధానికో రోజు పెట్టేసి.. అభిమానమనే అందమైన పేరు పెట్టి... తెగ కొనిపించేస్తున్నారు. దీని వలన ప్రతి కుటుంబం ఇబ్బందుల్లో పడుతోంది. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలు. ప్రచార హోరుకు లొంగిపోయి.. తమ స్థాయికి మించిన వస్తువులు కొనుగోలు చేసేసి.. డబ్బులు ఖర్చు పెడుతున్నారు. నిజమైన అవసరాలు వచ్చినప్పుడు డబ్బుల్లేక అప్పులు చేస్తున్నారు. వినిమయదారీ వ్యవస్థలో పడిపోయి.. అవసరం ఉన్నా లేకపోయినా.. ఏదో ఒక కొత్త వస్తువు కావాలన్నట్లు.. ఫీలైపోవడం ఎక్కువైపోయింది. గిఫ్ట్‌లు ఇవ్వకపోతే బంధం తెగిపోతుందనేంత దారాన్ని ఈ కంపెనీలు అల్లేశాయి. దాంతో కొనడానికి ముందుకెళ్లి.. అప్పులు చేసి అజ్ఞాతంలోకి పోయే వారి సంఖ్య తక్కువేం కాదు. ప్రజల జీవితాలను కొద్ది కొద్దిగా తినేస్తున్న ఈ సంస్కృతికి చరమగీతం పాడాలని కొన్ని ఎన్‌జీవోలు పని చేస్తున్నాయి. అందుకే అవి 'నో పర్చేజింగ్ డే' లేక 'బై నథింగ్ డే' అనే దానిని తమ ఉద్యమంలో భాగంగా తీసుకొచ్చాయి.

సమాజంలో తమ స్థాయి పెంచుకోవాలనే తాపత్రయం.. విలువైన వస్తువులుంటేనే మనిషికి విలువ ఇచ్చే సంస్కృతి బాగా పెరిగిపోయింది. అందుకే వినిమయదారీతత్వ వ్యతిరేక పోరాట సంఘం వారు ఈ 'బై నథింగ్ డే' ప్రతిపాదన తెచ్చారు. నవంబర్ నెల ఆఖరి శనివారంలో జరిగే ఈ కార్యక్రమానికి హాజరవుతారు. ఆ రోజు అందరూ షాపింగ్‌మాల్స్‌కి వెళ్లి.. ఏమీ కొనకుండా నిలబడతారు. ఆ తర్వాత ఇది శుక్రవారం నాడు చేయడం మొదలెట్టారు. దానికి బ్లాక్ ఫ్రైడే అని పేరు పెట్టారు. ఖాళీ బాస్కెట్లను తీసుకెళ్లి మాల్ చుట్టూ పెడతారు. టీవీలు, మొబైల్ లాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ఆ రోజంతా ఆపేయటం, కారు ఇతర వాహనాలు వాడకుండా పార్కింగ్‌లోనే పెట్టడం లాంటివి కూడా చేయడం మొదలెట్టారు. మొదట ఇది 1992లో కెనడాలో ప్రారంభమైంది. ఆ తర్వాత అమెరికా.... అలా అలా ప్రపంచవ్యాప్తంగా పాటిస్తున్నారిప్పుడు.

మనిషికి ప్రేమ, అభిమానం ఎలా వ్యక్తీకరించాలో.. బంధాలు ఎలా నిలుపుకోవాలో ఎవరూ కొత్తగా నేర్పించనక్కర్లేదు. అది తరతరాలుగా కుటుంబ వ్యవస్థ నేర్పించిన దారిలో సమాజం నడుస్తోంది. ఫలానా రోజే ప్రేమ కురిపించాలి.. అది కూడా భారీగా డబ్బులు వదిలించుకుని గిఫ్ట్‌లు కొనిచ్చి మరీ కురిపించాలి.. అనేది కార్పొరేట్ మాయాజాలం అలవాటు చేస్తున్న వినిమయదారీ సంస్కృతి తప్ప మరోటి కాదు. ఒకరిని చూసి మరొకరు అనుకరిస్తూ.. అవి పాటిస్తేనే తమకు విలువ పెరుగుతుందనే భ్రమలో ఉంటూ... వాటి కోసం అప్పులు సైతం చేసి కష్టాల్లో పడుతున్నారు. అమ్మ ప్రేమకు ప్రతిరూపమని ... నాన్న నమ్మకానికి నమూనా అని ... ఎవరో టీవీలో చెబితేనో...పత్రికలో రాస్తేనో... మనం నేర్చుకోవాల్సిన అవసరం లేదు. బంగారం లాంటి మన బంధాలను మనమే పదిలపర్చుకుందాం. ఒకరి కష్టసుఖాల్లో తోడు నీడగా ఉంటూ అసలైన ప్రేమను.. అభిమానాన్ని... కురిపిద్దాం. వ్యాపారగంధాలు పూసిన బంధాలు అక్కర్లేదని... స్వచ్ఛమైన బంధాలకు కృత్రిమంగా సృష్టించిన రోజులతో పనిలేదని చాటి చెబుదాం.

✦

అంకెలు చెప్పే ఖర్చులు

- వాలెంటైన్స్ డే రోజు ఇంకా ఉద్యోగాలు కూడా చేయని స్టూడెంట్స్ 2015లో ఎంత ఖర్చు పెట్టారనేది అమెరికాలో ఓ సంస్థ సర్వే చేసింది. దాని ప్రకారం ఒక్కొక్కళ్లు సగటున 30,000 రూపాయలు ఖర్చు పెట్టారు. గిఫ్ట్‌ల కోసం మగవాళ్లు 25,000 ఖర్చు పెడితే ... ఆడవాళ్లు 20,000 ఖర్చు పెట్టారు. 71 శాతం మంది 10,000 కంటే ఎక్కువగా ఖర్చు పెట్టారు. 16 శాతం మంది 20,000 పైనే ఖర్చు పెట్టారు. మిగతావారు అంతకంటే ఎక్కువ ఖర్చు పెట్టారు.
- వాలైంటెన్స్ డే రోజు జరిగిన వ్యాపారం ఒక్క భారత్‌లోనే 1500 కోట్లు. ప్రపంచ వ్యాప్తంగా జరిగిన వ్యాపారం లక్ష కోట్లకు పైనే.
- న్యూ ఇయర్ సెలెబ్రేషన్స్‌కు భారత్‌లో జరిగిన వ్యాపారం రు.5700 కోట్లు.
- అక్షయ తృతీయ ఒక్కరోజే బంగారం అమ్మకాలు రోజువారీ కన్నా 52 శాతం ఎక్కువగా, పండగ సందర్భాల కన్నా 27 శాతం ఎక్కువగా జరుగుతున్నాయి.

చదువుల తల్లీ... నీ పయనమెటు?

అడిగోపుల వెంకటరత్నమ్
సెల్ 9848252946

ఆ గది తలుపు తెరుస్తాను
దూసుకెళ్ళిన గాలి
గదిలో పచార్లు చేస్తుంది
తాతయ్య బోసి నోటిని కప్పిన
బొర్రమీసాల యశశ్శేష ఛాయా చిత్రం
పలకరిస్తుంది
"చెల్లియో చెల్లకో..."
"లేత యిల్లాలి నల్లపూసల సొరు"
రాగాలు గుండెల్లో గుభాళిస్తాయి
బౌద్ధమత ఆవిర్భావం
ఏ దేశం ఎందుకు ఓడిందో
తాతయ్య అనర్గళ ప్రసంగాలు
సనాతన సంప్రదాయాలు
సంస్కృతి గురించి
ఆయన సందేశాలు వినిపిస్తాయి!
ఆ గది తలుపు తెరుస్తాను
నన్ను దాటి వెళ్ళిన కాంతి
గది నింపి వెలుగులు చిమ్ముతుంది
నాన్న సౌహార్ద చూపుల ఫోటో
నన్ను వొళ్ళంతా తడిమి పలకరిస్తుంది
మానవతకు మారుపేరై
మానవ సేవ చేసి నిష్క్రమించిన
మాధవుణ్ణి చూస్తాను
గురజాడకు శిష్యుడై
వీరేశలింగానికి భక్తుడై
శ్రీశ్రీకి ప్రచారమై
నడిచిన నడక కనపడుతుంది!
ఆ గది తలుపు తెరుస్తాను
కుంకుడు రసం వాసన గుప్పుమంటుంది
సూర్య కాంతిలో వెలిగే బల్బు కింద
సోదరుడి నిద్ర సాగుతూ వుంటుంది
అతడి స్నాతకోత్సవ ఫోటో
ఏటవాలుగా గోడకు వేలాడుతూ కన్పిస్తుంది
తిరిగే పంకాకు నేను సెలవు ప్రకటించాక
అలసిన పంకా వినమ్రంగా నిల్చి నమస్కరిస్తుంది
భద్రంగా దాచాల్సిన కాగితాలు
బహిరంగంగా నేలపై బడి నిద్రిస్తున్నాయి
కాగితాన్ని తొక్కకుండా నడక సాగని స్థితి
కంప్యూటర్ ప్రాణం పోసుకునే వుంది
లాప్ టాప్ పండుకుని వుంది
ఉలిక్కిపడి సోదరుడి నిద్ర మేల్కొంది
పరుగెత్తుతూ వచ్చి పాప అడిగింది
బాబాయ్ భారత దేశ మొదటి ప్రధాని ఎవరు?
సోదరుడి వేళ్ళు కంప్యూటర్ మీద వాలాయి
ఈ గదిని సంస్కరించాల్సి వుంది
ఈ గదికి చదువు నేర్పాల్సి వుంది!

నేపాల్‌లోని హిమాలయ పాదాల చెంత ఓ మారుమూల కుగ్రామం ఉంది. అక్కడితో మనిషి జాడ కనుమరుగౌతుంది. అన్నీ అందించిన అడవి తల్లే వారికి మరో అద్భుతాన్నిచ్చింది. ప్రపంచంలోనే అతి పెద్దవైన హిమాలయ తేనేటీగలు పెట్టే ఎర్ర తేనె అది. వందల మీటర్ల ఎత్తున వేలాడుతూ దాన్ని సేకరించే గురుంగ్ తెగకు చెందిన ఆ గ్రామం ఎంతో ప్రత్యేకమైంది.

తేనెలూరు ఊరు

నేపాల్‌లోని కస్కి జిల్లాలో ఉండే ఈ గురుంగ్ గ్రామం మిగతా ప్రపంచంతో సంబంధం లేకుండా ఉంటుంది. మెలికలు తిరిగే డొంక దారుల్లో కాస్త దూరం వరకు వెళ్లాక వాహనాలకు బ్రేకులు పడిపోతాయి. అక్కడి నుంచి సముద్ర మట్టానికి 8000 మీటర్ల ఎత్తున ఉండే ఆ ఊరికి ట్రెకింగ్ చేసి వెళ్లాల్సిందే. బయటి వ్యక్తులు ఆ గ్రామ వాసుల అండ లేకుండా ఆ గ్రామానికి చేరుకోలేరు. రైఫిళ్లు పట్టుకుని వారు తోడు రానిదే ఎలుగు బంట్లు, చిరుతల దాడి ప్రమాదం నుంచి తప్పించుకోలేరు. గ్రామానికి వస్తూ వస్తూనే మీకో కొత్త అనుభవం ఎదురౌతుంది. ఊరంతా తేనేటీగల హోరుతో వినిపిస్తుంది. ఇళ్ల గోడలకు పట్టిన చిన్న చిన్న తేనే తుట్టెల్ని చూసి ఆశ్చర్యపడక తప్పదు. అవి తమను ఏమి చేయవని తెలుసో తెలీదో కానీ పక్కనే చిన్నారులు కేరింతలు కొడుతూ ఆటల్లో పడిపోతారు. కనుచూపు మేరలో ఠీవీగా అంతెత్తు కనిపించే హిమాలయ సానువులు. వాటి పాదాల్ని తాకుతూ విస్తారంగా కనిపించే దట్టమైన అడవి ఆ గ్రామం దగ్గరలో మరో ఊరు జాడ కనిపించదు.

ప్రమాదపుటంచుల్లో...

కేవలం 150 మంది గ్రామ ప్రజలుండే మరో లోకంలో ఉన్నామనే భావన కలిగి ఒకింత సంభ్రమం, కాసింత భయాన్ని కలిగిస్తుంది. గ్రామస్తులంతా ఒకే కుటుంబంగా ఊరి పనులు, వ్యవసాయం చేసుకుంటూ గడుపుతుంటారు. ఇవన్నీ ఒక ఎత్తు అయితే వారు సేకరించే ఎర్ర తేనె ప్రత్యేకత ఒక ఎత్తు. మధుమేహం చికిత్సకు, శృంగార ఉద్దీపనకు, పరిపూర్ణ ఆరోగ్యానికి దివ్యౌషధంగా అది పనిచేస్తుందని చెప్తారు. చైనీయులు, నేపాలీలు ఆ తేనె సేకరణ సీజన్ కల్లా దగ్గరలోని సంతకు చేరిపోతారు. మూడు స్పూన్లకు మించి తీసుకుంటే ఔషధమైన అదే ప్రాణాంతకం అవుతుంది. కంటిచూపు సమస్యలు, చిత్త భ్రమలు, వాంతులు–వికారం, ఒళ్లు మొద్దుబారిపోవడం, హృదయ స్పందనలు తీవ్రమవడం, ఆఖరుకు ప్రాణ నష్టాన్ని కూడా కలిగించే ఈ తేనెతో చాలా జాగ్రత్తగా ఉండాలి. గాఢమైన అబ్సింత్ అనే సారాయి కన్నా ఎక్కువ మత్తును కలిగించే ఈ తేనె తెలీకుండానే ఎక్కువ స్వీకరించేలా చేస్తుంది. అపీస్ డోర్సాట హెబోరియోసా అనే తేనేటీగలు పోగుచేసే ఈ తేనె చాలా విలువైంది. దాన్ని సేకరించేందుకు ప్రాణాల్ని లెక్కచేయరు గురుంగులు. సూర్యరశ్మి తగలని, ఎలాంటి అపాయం కలగని ఎత్తైన ప్రాంతంలో, పర్వత అంచుల్లో తుట్టెను పెడతాయవి. వీటి తేనెకు రోగ నిరోధక లక్షణాలతో పాటు విష ప్రభావం రావడానికి కారణం పాంటీకన్ రోడోడెండ్రాన్ అనే ఎర్రటి పూలే. గ్రేయానోటాక్సిన్స్‌ను కలిగి ఉండే ఈ పూల చెట్లు అక్కడి అరణ్యాల్లో విస్తారంగా పెరుగుతాయి. తేనె వల్ల విష ప్రభావం ఎక్కువైన వారికి అక్కడి వనమూలికలతోనే చికిత్స చేసి కేవలం రోజుల వ్యవధిలో పూర్తిగా కోలుకునేలా చేసేస్తారు గురుంగులు. తేనె తుట్టెలుండే చోటకు 3 గంటలపాటు ట్రెక్ చేసి వెళ్లే వారు ఊడలు, వెదురు బొంగులతో చేసిన నిచ్చెనల్ని వాడతారు. కనీసం 200 మీటర్ల ఎత్తున ఉండే ఆ తేనెతుట్టెల్ని అందుకోవడం కోసం శిఖరానికి చేరుకుని అక్కడి నుంచి కిందకు నిచ్చెన జారవిడిచి ప్రాణాల్ని గాల్లో పెట్టి తేనె సేకరిస్తారు. మధ్య యుగం నాటికే ఆ ప్రాంతానికి వచ్చిన వీరి పూర్వీకులు తరతరాలుగా అదే పని చేస్తుండటంతో వీళ్లకు అది చాలా తేలికైన పనిలా తోస్తుంది. తేనేటీగలు దండెత్తినా ముసుగులు, గ్లోవ్స్ లాంటివి వాడకుండానే టాంగో అనే సూది కర్రతో తుట్టెను విరుస్తారు. దాన్ని పైనుంచి జారవేసిన బుట్టలోకి తీసుకుంటారు. తేనేటీగల కన్నా వారి సేకరణ పద్ధతులే అతి ప్రమాదకరంగా ఉంటాయి. నేలకూలి చనిపోయిన చాలా మంది వున్నారు. అక్కడ ఒక్కో కొండ అంచుకు ఒక్కో పేరు ఉంటుంది. ఆ పేర్లన్ని ప్రమాదంలో చనిపోయిన వాళ్లవే.

బుద్ధిజాన్ని విశ్వసించే వీళ్ల ఆచారాలు మాత్రం గిరిజనులవే. ఏడాదికి రెండు సార్లు వసంతకాలం, ఆకురాల్చే కాలంలో తేనె సేకరించే వీళ్లు తేనె సేకరణకు ముందు ఆ ప్రాంతంలో పూజ నిర్వహిస్తారు. కొండ దేవుడికి మేకలనో, కోళ్లనో బలిస్తారు. తేనె సేకరించాక కొంత భాగాన్ని అడవి జంతువుల కోసం విడిచి వస్తారు. ఒక్కో తుట్టె నుంచి 20 నుంచి 50 కేజీల వరకు తేనె సేకరించే అవకాశం ఉంటుంది. తుట్టె ఆకృతి కూడా ప్రత్యేకంగా ఉంటుంది. పసుపు పచ్చ, నారింజ రంగుల వలయాలుగా వుంటుంది. నమ్మశక్యంగా లేని ఈ తేనె ప్రభావం లాంటిదే ఒకటి చరిత్రలో నమోదైంది. టర్కీలోని ఓ గ్రామంలోకి చొరబడి అక్కడ పెంచే తేనెను ఎత్తుకుపోయిన గ్రీకులు, రోమన్ల సైన్యాలు దాని మత్తు ప్రభావానికి లోనై ఎక్కువగా తాగేసి స్పృహ తప్పి పడిపోయారు. చాలా మంది తీవ్ర అనారోగ్యం బారిన పడి సైన్యం నష్టపోయింది. ఓటమి పాలైంది. ఆశ్చర్యం కలిగించే ప్రత్యేక తేనెతో, సాధ్యం కాని జీవనశైలితో, మరొకరు మనగలగలేని సవాళ్లతో ఆ గురుంగుల గ్రామంపై ఎన్నో డాక్యుమెంటరీలు వచ్చాయి.

సామాన్యశాస్త్రం

తరగతి గదిలోనూ తప్పని కుల వివక్ష

పిల్లలైనా...బడి పిల్లలైనా...వారి మనసు, మాట, చూపు, చేత, ఆలోచన మల్లెలంత స్వచ్ఛం. తరగతి గదిలో అయినా... ఇంటి పరిధిలో అయినా... పరిసరాల నుంచి.. పెద్దల నుంచి.. చూసి నేర్చుకునేది.. ఒడిసి పట్టుకునేదే అధికం. అంతా మంచివాళ్లే, హితులే, స్నేహితులే అనుకునే అమాయకపు చిన్నారులు ...తరగతి గదుల్లో కుల వివక్షను చవిచూడాల్సి వస్తే..! మీరు పెద్ద కులపోళ్లు...మీరు కిందివాళ్లు...దూరంగా వుండాలి. ఒకరినొకరు తాకొద్దు. ఒకరి వస్తువులు మరొకరు ముట్టొద్దు. పూజకు రావొద్దు. వాళ్లు వండింది తినొద్దు... వంటి ఆంక్షలు ఆ పసి మనసులను ముక్కలు చేస్తుంటే ఏం నేర్చుకుంటారు? తక్కువ కులం పేర స్కూలు శుభ్రం చేసేపనిని కొందరికే అప్పగిస్తుంటే... వేరే గదుల్లో కూర్చోబెడుతుంటే... మధ్యాహ్న భోజనం వేరువేరుగా పెడుతుంటే... ఏం నేర్చుకుంటారు? అంటరానితనం నేరమని రాజ్యాంగంలో రాసుకుని ఆరు దశాబ్దాలు దాటుతున్నా... ఇంకా ఈ వివక్ష వదలలేదని... విష సర్పంలా మనల్ని చుట్టుకునే వుందనడానికి ఇటీవల పలు రాష్ట్రాల్లో జరిగిన ఘటనలే నిదర్శనం.

కె. అంజన



దళితులని... పూజకు రావద్దన్నారు...

వినాయకచవితి వచ్చిందంటే చిన్నారులదే సందడంతా. అలాంటిది గణేష్ పూజకు వారిని రావొద్దంటే...! అంతకంటే దారుణం ఏముంటుంది? ఒడిషాలోని కేంద్రపరా వందేమాతరం హైస్కూల్ దారుణానికి వేదికైంది. స్కూల్లో గణేష్ పూజకు సిద్ధం చేస్తున్న మిత్రులాలు సుమి పరీదాకు సాయం చేస్తున్న సవితను పి.టి మాష్టారు అడ్డుకున్నారు. 'కందారా' అమ్మాయివి కనక పూజకు హాజరు కాకూడదని శాసించారు. కులం పేరు ఎత్తి చూపి దూరంగా వుంచాలని చూసిన మాష్టారిపై కేకలేసి...కన్నీరు పెట్టుకున్న సవితను సముదాయించి... పూజకు పంపించాల్సిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మరింత పెద్ద తప్పు చేశారు. ఇలాంటి సమస్యలెన్నిటినో జీవితాంతం ఎదుర్కోవాల్సి వుంటుందంటూ మరింత బాధపెట్టేలా మాట్లాడారు. అంతటితో ఆగక ఇంటికి వెళ్లబోతున్న పాతికమంది దళిత చిన్నారులను సైకిల్ తాళాలు లాక్కొని గదిలో బంధించారు. ఆకలవుతోందని... ఇంటికి పంపించమని వేడుకొన్నా... మధ్యాహ్నం 3 గంటల వరకు విడిచి పెట్టలేదు. వారిలో ఒకరు స్కూలు గోడ దూకి ఇంటికెళ్లి జరిగిన విషయం చెప్పాక... తల్లిదండ్రులు రంగప్రవేశం చేశారు. కారకులైన టీచర్లు, ప్రధానోపాధ్యాయునిపై పట్టముదాయ్ పోలీస్ స్టేషన్లో కేసు పెట్టి.... తమ చిన్నారులకు జరిగిన అన్యాయంపై చట్టపరమైన పోరాటానికి దిగారు.

దళిత చిన్నారులే చెత్త ఏరాలి

పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవడం మంచిదే. అది అందరూ కలిసికట్టుగా చేస్తే మరింత మంచిది. అలాకాకుండా ఏ ఒక్క కులానికి చెందినవారికో మాత్రమే చెప్తే! అది రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగింది. ఇక్కడి ఓ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి రోజూ దళిత విద్యార్థులు స్కూల్లో చెత్త ఏరాల్సి వస్తోంది. లేనిపక్షంలో టీసీ ఇచ్చి పంపించేస్తామని టీచర్లు బెదిరిస్తున్నారు. నిజానికి అక్కడ ఊడ్వడానికో మహిళ వున్నా... ఆమెకు ఇచ్చేది 500 రూపాయలు మాత్రమే కావడంతో... చుట్టపు చూపుగా వచ్చిపోతుంటుంది. దాంతో బెదిరించో, భయపెట్టో దళిత చిన్నారులతో ఆ పని కానిచ్చేస్తున్నారు పెద్దలైన మాష్టార్లు.

'ఇవాళ ఎవ్వరూ తినలేదు'

గత అయిదు మాసాలుగా రాధమ్మ డైరీలో కనిపిస్తున్న మూడు పదాలు అవే. ధనిక, పేద తేడా లేకుండా చిన్నారులందరికీ పౌష్టికాహారం అందాలన్న ఉద్దేశ్యంతో ఏర్పరచింది మధ్యాహ్న భోజన పథకం. అయితే దళితురాలైన రాధమ్మ వంట చేసిన కారణంగా తమ పిల్లలను స్కూల్లో భోజనం చేయవద్దని ఆదేశించారు అగ్రకుల భావజాలం తలకెక్కిన తల్లిదండ్రులు. అంతటితో ఆగక తమ పిల్లల్ని ఆ స్కూలు నుంచి వేరే స్కూలుకి మార్చేశారు. దాంతో కర్నాటకలోని కగ్గనహళ్లి గ్రామ పాఠశాల విద్యార్థుల సంఖ్య 118 నుంచి 18కి పడిపోయింది. రాధమ్మను మధ్యాహ్న భోజన పథకం కింద పనిలోకి తీసుకున్నప్పుడే గ్రామంలోని అగ్రకులస్తులు గొడవ చేశారు. ఇప్పటికైనా ఆ కొద్దిమంది పిల్లలైనా మిగలాలంటే రెండే మార్గాలున్నాయి రాధమ్మ ముందు. ఒకటి తను కాకుండా వేరే వారితో వంట చేయించడం. రెండు తను పనిలోంచి మానేయడం. అంతకు మించి కులం సాకుతో తనను, తన వంటను వెలివేసే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించే పరిస్థితి రాధమ్మకు లేదు. ఒక పేద దళిత కుటుంబానికి చెందిన ఆమెకు స్కూల్లో వంట చేయడం ద్వారా నెలకు అందే 1700 రూపాయల జీతమే ఆధారం...ఆహారం మరి.

రాధమ్మ

మణికట్టుపై కులం గుర్తు

'కలిసి కూర్చోవాలన్నా, మాట్లాడాలన్నా, భోజనం చేయాలన్నా తోటి కులపోళ్లతోనే! తక్కువ కులపోళ్ల పొడే తగలకూడదు' అన్నది కొందరు అగ్ర కుల పెద్దలు తలకెక్కించుకున్న వెర్రి ఉన్మాదపూరిత అభిప్రాయం. అందుకే చదువుకునే పిల్లల చేతికి కూడా కులపు గుర్తులను తగిలించేశారు. అగ్రకులస్తులు ఎరుపు రంగు బ్యాండ్లు, దళితులు ఆకుపచ్చ బ్యాండ్లు తగిలించుకుని బడికి వస్తారు. ఈ తంతుకు వేదిక తమిళనాడులోని తిరునెల్వేలి ప్రభుత్వ పాఠశాల. ఎవరు తమ స్నేహితులో, ఎవరు కాదో ఈ బ్యాండ్ల ద్వారా నిర్ణయించుకోవాల్సి వచ్చిందా చిన్నారులు. అలాగే మరో స్కూల్లో తమ కులాన్ని తెలిపే రంగు బొట్టు పెట్టుకోవడం కూడా వుంది. మెడలో వేసుకునే లాకెట్లు కూడా కులం గుర్తులుగా వెలిశాయి. నాడార్ విద్యార్థులు కె.కామరాజ్ లాకెట్లు, యు.ముత్తురామలింగం థేవర్, లాకెట్లను థేవర్లు, గొండర్ విద్యార్థులు చిన్నమాలై లాకెట్లు వేసుకుంటున్నారు. ఇవన్నీ పసి మనసుల్లో లేనిపోని కులవిద్వేషాలను రగిల్చేవే.

దళితులకు ప్రత్యేక అంగన్‌వాడి

అంగన్‌వాడి కేంద్రాలు పసివాళ్లకోసం ఏర్పాటుచేసినవి. ఆరు మాసాల నుంచి ఆరేళ్ల వయసు గల పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించడం వీటి లక్ష్యం. అసలు లక్ష్యం సంగతి అటుంచితే... ఆ చిన్నారులను కుల వివక్ష అనే కాలనాగు చుట్టేస్తోంది. గుజరాత్‌లోని హాజీపుర గ్రామంలో నెం.159, నెం.160 అని రెండు అంగన్‌వాడి కేంద్రాలున్నాయి. ఒకటి దళిత పిల్లల కోసం. మరొకటి అగ్రకులపు పిల్లల కోసం. ఓసారి తన స్నేహితురాలి వెంట నెం.160 అంగన్వాడీ కేంద్రంలోకి వెళ్లబోయిన మూడేళ్ల చిన్నారి మానవికి చేదు అనుభవం ఎదురైంది. ఆమెను నిర్వాహకురాలు అడ్డుకొని నెం.159లోకి వెళ్లమంది. తను అక్కడికి ఎందుకు వెళ్లకూడదో... అర్థం కాని ఆ పాప కన్నీళ్లతో వెళ్లిపోయింది. అదే ప్రశ్నను తల్లిని అడిగితే సమాధానం ఇవ్వలేకపోయిందామె. ఆమే కాదు. ఎవ్వరూ ఇవ్వలేరు.

కులపరమైన వివక్ష... వేధింపులు అంతం కావాలంటే... మన దేశంలో ఎంత మంది అంబేద్కర్లు ఉదయించాలో!!

... పళ్లెం తాకినందుకు చితక్కొట్టారు

రాజస్థాన్‌లోని రాజ్‌కీయ ఉచ్ఛ మాధ్యమిక్ విద్యాలయంలో జరిగిందీ ఘోరం. ఆ స్కూల్లో మధ్యాహ్న భోజనాల దగ్గర పళ్లేలు రెండు వరుసల్లో విడివిడిగా దూరంగా పేర్చి వుంటాయి. ఒకటి అగ్రకులపు పిల్లల కోసం. రెండోది దళిత పిల్లలకోసం. పొరపాటున దళిత పిల్లవాడు దినేష్ చెయ్యి అగ్రకుల పిల్లవాడి పళ్లేనికి తగలడమే పెద్ద నేరమైంది. దాంతో ఆ పన్నెండేళ్ల పసివాణ్ణి విపరీతంగా కొట్టారు క్లాసు మాష్టారు. గాయాలతో ఏడ్చుకుంటూ ఇంటికెళ్లిన దినేష్‌ని చూసిన కన్నవారికి కడుపు తరుక్కుపోయింది. పసివాళ్ల పట్ల ఈ భేదభావాలు చూపించడమేంటని ప్రశ్నించడానికి స్కూలుకెళ్లిన పిల్లవాడి తండ్రిని మెడ పట్టి బయటికి గెంటేశారో టీచర్. దళిత పిల్లలపై చిన్న విషయానికి సైతం చెయ్యిచేసుకోవడం ఇదేం మొదటిసారి కాదు. కొద్ది రోజుల కిందట పదవ తరగతి చదివే దయారామ్ మాష్టారి కుర్చీ తాకాడని విచక్షణా రహితంగా కొట్టడంతో అతను పదిహేను రోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాల్సి వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైన దినేష్ కేసుపై విచారణకు ఆదేశించారు ఎలిమెంటరీ అండ్ సెకండరీ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్. ఇదిలా వుండగా దినేష్‌ని దండించిన టీచర్ని సెక్షన్ 323, సెక్షన్ 341 కింద అరెస్టు చేశారు. అయితే ఆ మాష్టారు వెనువెంటనే బెయిల్ మీద బైటికి రావడం కొసమెరుపు.

నాగభూషణం పేరు వెండితెర మీద కనిపించగానే కొన్ని మెరుపులూ.. మరికొన్ని విరుపులూ.. పెదవుల మీద సన్నని చిరునవ్వు. ఆలోచించే కొద్దీ చక్కిలిగింతలు పెట్టే హాస్యం వెరసి వంద శాతం వినోదం మనకు దక్కుతుంది.

రచయిత రాసిన డైలాగుని ఎంత అందంగా ఎంత వినూత్నంగా చెప్పచ్చో నాగభూషణం ఒక ఉదాహరణ. యస్వీ రంగారావు, గుమ్మడి లాంటి దిగ్గజాలు వుంటుండగానే తనదైన ముద్ర వేసుకున్న నాటక రాయుడు.

ప్రతిభా ఫిలింస్ వారి 'ఏది నిజం' చిత్రం ద్వారా వెండితెరకి పరిచయమై 1952 'పల్లెటూరు' చిత్రంలో కొండయ్య పాత్ర, 'రేచుక్క' చిత్రంలో చిట్టివీరన్న పాత్రల్లో నటించినా 'ఏదినిజం' చిత్రం రవ్వంత గుర్తింపునిచ్చింది. మాయాబజార్, భూకైలాస్ చిత్రాల్లో నిజమైన పామును మెళ్లో వేసుకుని శివుడి పాత్రలో ధైర్యంగా కనిపించాడు. ఆ తర్వాత శివుడి పాత్రలు ఆయన్ను వరించాయి. (చెంచులక్ష్మీ చిత్రం) భట్టి విక్రమార్క (ప్రచండుడు) భీష్మ (పరశురాముడు)తోపాటు 1962లో వచ్చిన 'మంచి మనసులు' చిత్రంలో వాసంతి సరసన జానకి అన్నగా నటించి మంచి మార్కులు కొట్టేశాడు. ఆ చిత్రంలో అక్కినేని, సావిత్రి, జానకి, వాసంతి, గుమ్మడి లాంటి గొప్ప నటులున్నా నాగభూషణం హాస్య

నాటకాల రాయుడు

మిళితమైన విలన్ పాత్రల ద్వారా సరికొత్త ఒరవడి ప్రారంభించాడు.

రక్తకన్నీరు నాటకం ఆయువు

తమిళనాడు యం.ఆర్. రాధా విలక్షణమైన నటుడు. యంజీఆర్, శివాజీలకు ధీటుగా నటించేవాడు. తమిళంలో రక్తకన్నీరు నాటక ప్రదర్శనలు ఇస్తుండేవారు. ఈ నాటకాన్ని జనం ఎగబడి చూసేవారు. ఆయన అయిదువేలు పై చిలుకు ప్రదర్శనలు ఇచ్చాడు. ఆ నాటకం నాగభూషణాన్ని కమ్ముకుంది. ఆ నాటకం తెలుగులో ప్రదర్శిస్తే జన్మధన్యమవుతుందని కలలుగని ప్రముఖ రచయిత పాలగుమ్మి పద్మరాజుని ఆశ్రయించాడు. పద్మరాజు తెలివిగా తెలుగువారి మనోభావాలకు ఏమాత్రం బాధ కలిగించకుండా ఆద్యంతమూ ఆసక్తికరంగా మలిచాడు. ఈ నాటకం నాగభూషణం జీవితంలోని దశ, దిశల్ని మార్చింది. నెలకు పది, ఇరవై ఒక్కోసారి నెలపొడుగుతా రక్తకన్నీరు ప్రదర్శనలు ఇచ్చిన సందర్భాలు కోకొల్లలు. తొలిరోజుల్లో నాగభూషణం హీరో కాగా, శారద నాగభూషణం అర్ధాంగి పాత్రలో, సీత వేశ్య పాత్రలో నటించి మెప్పించారు. ఆ నాటక ప్రదర్శనలకు ముందే సీతకి మంచిపేరు వచ్చింది. అవి బాగా ఉపయోగపడ్డాయి. నాటకం ప్రదర్శిస్తున్న సమయంలో నాగభూషణం సీతలు పోటీపడి నటించేవారు. ఈ నాటకం చూస్తున్నంత సేపూ ఒక ప్రదర్శన చూస్తున్నట్లుండేదికాదు. మూడు నిండు జీవితాల మధ్య నలిగిపోతున్న సంఘటనలు కనిపించేవి.

వామపక్ష భావాలే ఊపిరి

నాగభూషణం స్వతహాగా అభ్యుదయ ఆలోచనలు కలిగి వుండేవాడు. అప్పటి ప్రముఖ కమ్యూనిస్ట్ నాయకుల ప్రభావం ఆయన మీద వుంది. జనసామాన్యంతో ఇట్టే కలిసిపోయేవాడు. ఏదైనా వూళ్లో ప్రదర్శన ఇవ్వాలనుకుంటే ముందుగా అక్కడి సామాజిక, రాజకీయ పరిస్థితుల్ని క్షుణ్ణంగా తెలుసుకునేవాడు. నాటకం ప్రదర్శిస్తున్నప్పుడు ఆ సమస్యల్ని అందంగా నాటి రాజకీయ నాయకుల గుండెల్లో సూటిగా గుచ్చుకునేలా చెప్పేవాడు. హాలంతా హర్షధ్వానాలతో నిండిపోయేది. కమ్యూనిజం బాగా చదివాడు. లెనిన్, మార్క్స్‌ల్ని గురించి గంటల తరబడి చెప్పగలిగేవాడు. కళని రాజకీయాలతో ముడిపెడితే జనరంజకంగా వుంటుందని నమ్మిన వ్యక్తి నాగభూషణం. అందుకనే ఆ నాటకం పూర్ణాయుష్షుని సంతరించుకుంది. ఎన్ని వేల ప్రదర్శనలిచ్చినా 'రక్తకన్నీరు' నాటకం ఎప్పుడు చూసినా నిత్యనూతనంగా ఉండేది.

'కథానాయకుడు'లో విశ్వరూపం

యన్.టి.ఆర్, జయలలిత నాయక నాయకీలుగా నటించిన హేమాంబరధరరావు దర్శకత్వంలోని 'కథానాయకుడు' ఆ రోజుల్లో సంచలన విజయం సాధించింది. అందులో ముగ్గురు విలన్లు. నాగభూషణం ప్రధాన

పాత్రధారి. ఆ పాత్ర ప్రారంభంలోనే పావురాలకు మేత పెడుతూ చటుక్కున చావగొడతాడు. అందులో భమిడిపాటి రాధాకృష్ణ రాసిన డైలాగుల్ని చాలా చక్కగా ఇంప్రొవైజ్ చేశాడు. 'ప్రతి మనిషికీ ఒక రేటు ఉంటుంది. ఎక్కువ తక్కువ అంతే తేడా.' అలాగే 'డబ్బు టేబుల్ మీద పెట్టి ఆ టేబుల్ చూడు. డబ్బు టేబుల్ మీదకి రాగానే ధగధగ ఎలా మెరిసిపోతుందో..' అంటాడు కథానాయకున్ని ఉద్దేశించి. 'నలుగుర్ని వెనకేసుకునేవాడు నాయకుడైతే.. ముందు ముందు నలభయ్ మందికి కిరాయిచ్చి తిప్పుకుంటారు' ఇలాంటి సంభాషణలు ఎన్నో. వయోభారం ఒకపక్క, సినిమాల్లో ఊహించని విధంగా బిజీ అయిపోవడం మరోపక్క నాటక ప్రదర్శనలు తగ్గించి సినిమాలకే మొగ్గుచూపాడు.

మరపురాని పాత్రలెన్నో..

మూగమనసులు చిత్రంలో జమునని పిచ్చిగా ప్రేమించి వెంటబడే పాత్ర, 'ఉమ్మడి కుటుంబం'లో కృష్ణ కుమారి తండ్రి పాత్ర. 'ఆత్మీయులు'లో వాణిశ్రీ తండ్రి పాత్ర. 'బుద్ధిమంతుడు'లో శేషయ్య పాత్ర. 'అందాలరాముడు'లో లత తండ్రి పాత్ర, ధర్మదాత చిత్రంలో జమీందారు భుజంగంగా, 'దసరాబుల్లోడు'లో చంద్రకళ తండ్రిగా, 'భలేరంగడు' జమీందారుగా, మోసగాళ్లకు మోసగాడు చిత్రంలో కౌబాయ్ పాత్రల్ని అభిమానులు ఎప్పటికీ మరిచిపోలేరు. 'ఎలా వుంది, ఎలా వుంది అబ్బాయా. వేడిగుందా చల్లగుందా అబ్బాయా' పాట ఆయన మీద చిత్రీకరించారు కృష్ణ కాంబినేషన్‌లో. పట్టుకుంటే లక్ష, జై జవాన్, భలే దొంగలు, అడవి రాముడు, కురుక్షేత్రం, గోపాలావుగారి అమ్మాయి, జాతర, గడసరి అత్త సొగసరి కోడలు, నేటిభారతం ఇత్యాది చిత్రాల్లో అద్భుత నటన ప్రదర్శించిన ఆయన మొత్తం 395 చిత్రాల్లో నటించగలిగాడు. నాగభూషణం ఏ పాత్రలో కనిపించినా జనం మైమరచిపోయి చూడటం అలవాటైపోయింది.

నిర్మాతగా ...

ఎ.భీమ్ సింగ్ గారి దర్శకత్వంలో 'ఒకే కుటుంబం' చిత్రం నిర్మించాడు. ఇందులో కథానాయిక లక్ష్మీ. తర్వాతి చిత్రం నాటకాల రాయుడు. ఇందులో కథానాయిక జయంతి. మూడవ చిత్రం విజయ నిర్మల దర్శకత్వంలో 'ప్రేమ చేసిన పెళ్లి'. ఇందులో రంగనాథ్, చంద్రమోహన్‌లు నటించారు. నటుడిగా ఎంత సక్సెసయ్యాడో, నిర్మాతగా అంత ఫెయిలయ్యాడు. మాట మీద నిలబడే నైజం నాగభూషణానిది. తాను నష్టపోతున్నా రూపాయి ఎవరికీ బకాయి పెట్టకుండా అందరికీ చెల్లించేవాడు. నాగభూషణం సరదాగా అంటుండేవారు 'ఎవరినైనా శత్రువుగా భావిస్తే వారికి ప్రత్యేకించి పనిష్మెంట్ ఇవ్వవలసిన పనిలేదు. ఆయన చేత ఒక సినిమా తీయించు చాలు! అనేవారు. అది నిజమేనేమో! తన జీవితంలో యస్వీఆర్‌తో పోటీగా 'అందరూ దొంగలే' చిత్రంలో నటించడం మరచిపోనంటాడు.

అభిమానధనుడిగా ...

నాగభూషణానికి టీమ్‌ని మెంటైన్ చెయ్యడం ఎంత కష్టమో తెలుసు. అందువలన మిగతా వారిలా భారీ అడ్వాన్సులు డిమాండ్ చేసేవాడు కాదు. ఎవరయినా 'ఐడియాలజీ' వున్న నిర్మాత ఎదురుపడితే ఇక ఇంతే సంగతులు. డబ్బు విషయం తర్వాత చూసుకుందాం.. అని సినిమా ముందు పూర్తి చేసే ప్రయత్నం చేసేవాడు. చెల్లని చెక్కులతో ఇంటి నిండా తోరణాలు కట్టినా ఇంకా సగం మిగిలిపోతాయి.. అని తన మీద తాను జోక్ చేసుకుని నవ్వేసేవాడు. ఈ నవ్వుల నటుడు 1995 మే 5న శాశ్వతంగా జీవన్నాటక స్థలాన్ని విడిచి వెళ్లిపోయాడు.

సీతకే అంకితం

ఎక్కువ సమయం సీత ఆరోగ్య పర్యవేక్షణలోనే గడిపేవాడు. సినిమాలు తగ్గాయి. నాటక ప్రదర్శనలు ముగిశాయి. కుటుంబంలో ఎవరికివ్వాల్సింది వారికిచ్చి సీత దగ్గరే సాంత్వన పొందాడు. ఆమెకు నాగభూషణం పట్ల అపారమైన ప్రేమ, భక్తి భావం వున్నాయి. వారి పిల్లల్లో ఒకరు ప్రస్తుతం కెమెరా డిపార్టుమెంట్‌లో కొనసాగుతున్నారు. అవార్డులూ రివార్డులూ లేవు. జనం చప్పట్లను మించిన అవార్డులేముంటాయి? అని ప్రశ్నిస్తారు.

విలక్షణమైన నటుడిగా నాగభూషణం పేరు మీద అవార్డులు ప్రకటించాల్సిన అవసరం ఉంది. స్వయంకృషితో అత్యుత్తమ స్థాయికి చేరినా, సినిమాకి తల్లి అని పిలువబడే రంగస్థలాన్ని మరిచిపోలేదు. రంగస్థల కళాకారులకి నాగభూషణం ఎంతో గౌరవాన్నిచ్చేవారు. తనతో సమంగా చూసుకునేవారు.

గుమ్మడి, అల్లు రామలింగయ్యతో...

- ఇమంది రామారావు
9010133844

వాషింగ్ మ్యూజిక్

సంగీతాన్ని వంట పాత్రలతో, రేకు డబ్బాలతో అదరగొట్టేలా సృష్టించే వాళ్లున్నారు. వాళ్లే ఆదర్శమో ఏమో ఈ ఇద్దరు మిత్రులు వాషింగ్ మెషీన్ చేసే శబ్దాలను రికార్డు చేసి సంగీత కచేరీ ఇచ్చేశారు. సుమారు 38 నిమిషాల ట్రాక్‌ను సిద్ధం చేసేశారు. మాట్మోస్‌గా పిలుచుకునే ఈ బ్యాండ్ మిత్రులు బాల్టీమోర్‌కు చెందినవాళ్లు. అంతకు ముందు ఆవు గర్భసంచి శబ్దాలతో సంగీతాన్ని రూపొందించిన వీళ్లు అన్నీ ఇలాంటి పనులే చేస్తుంటారు. రోజూ రొద పెడుతున్న ధ్వనుల్లో చాలా మ్యూజిక్‌ను వడకట్టేయొచ్చని చెప్పే మాట్మోస్ త్వరలో అమెరికా నగరాల్లో తిరిగి తమ వింత సంగీత ప్రదర్శనలివ్వబోతున్నారు.

బిక్కు బిక్కు మంటూ నిద్రపోండి

అమెరికాలోని నెవడా ఎడారి అంటేనే విచిత్రాలకు స్థావరం. అక్కడి తోనోపాహ్‌లోని క్లౌన్ మోటెల్ మరీను. అమెరికా వాసులకు క్లౌన్‌లు అదేనండి సర్కస్‌లో ఎరుపు నీలం బట్టల్లో ముక్కుకు ఎర్ర రంగు పూసుకుని నవ్వించే జోకర్లంటే చాలా భయం. కౌల్రోఫోబియా అనేది ఈ భయానికి పేరు. ఈ భయాన్నే ఆసరాగా తీసుకుని కేవలం వాళ్ల ఆహార్యంలోనే నడిపే మోటెల్ అది. అక్కడ ఒక్క రాత్రి ఉండాలంటే దడదడలాడిపోతారు వాళ్లు. అయినా థ్రిల్ కోసం అని బానే ఎగబడుతున్నారు. దశాబ్దాలుగా ట్రక్ డ్రైవర్లు, ఆ దారిన పోయే టూరిస్ట్‌లకు సేవలు వణుకు పుట్టిస్తూనే అందిస్తోందది. ఎక్కడి పడితే అక్కడ కనిపించే వాళ్ల గదుల్లో మాత్రం ఉండరులెండి. కానీ వారి బొమ్మలు, రూపాలు మాత్రం నిద్రపట్టనివ్వవు. 2500 మంది జనాభా ఉండే ఆ గ్రామంలో కష్టమర్లను భయపెట్టడానికి భీతిగొలిపే శ్మశానం కూడా మోటెల్‌కు దగ్గరలో ఉంటుంది.



వింత లోకం

అచ్చు అదే..

లూసియానాకు చెందిన ఫిలిఫ్ డుపాంట్ అనే పశు వైద్యుడు తన కుక్కను పోలిన మరో కుక్కను క్లోనింగ్ చేయించుకుని ఎక్స్‌ట్రాగా పెంచుతున్నాడు. దీనికి ఆయన 65 లక్షల రూపాయలపైనే ఖర్చు చేశాడు. ఇలా ఎందుకని అడిగితే తను రెండేళ్ల క్రితం మెల్విన్ అనే కుక్కను పెంచడం మొదలెట్టాడు. కొన్ని రోజులకు అదే సర్వస్వమైపోయింది. కెన్ గోర్డాన్ అనే బంధువు, హెన్రీ ఫొంటెనోట్ అనే స్నేహితులకు గుర్తుగా మెల్విన్ జిరాక్స్‌లు అయిన రెండు కుక్కల్ని క్లోనింగ్ చేయించాడు. ఈ పప్పీలు కాస్త ఇప్పుడు పెద్దవై మెల్విన్ స్థానాన్ని ఆక్రమించేస్తున్నాయి. రెండూ ఒకేలా ఉండటంతో వాటిని తేలిగ్గా గుర్తుపట్టేందుకు ఎరుపు, నలుపు మెడ బ్యాండ్ తగిలించి పోల్చుకుంటున్నారు కుటుంబ సభ్యులు. అయితే తొలిసారే ఈ క్లోనింగ్ విజయవంతం కాలేదు. రెండో సారికి గానీ ఫిలిఫ్‌కు మెల్విన్ అంశలు సొంతమయ్యాయి. ఓ పక్కన ఇలా జంతువుల క్లోనింగ్‌పై పెద్ద దుమారమే అక్కడ చెలరేగుతోంది. మనుషుల క్లోనింగ్‌ను నిషేధించడంతో మార్కెట్, వ్యాపారమంతా జంతువుల మీద పడి కొత్త అవకాశాల్ని, కొత్త ఆశ్చర్యాల్ని, కొత్త సమస్యల్నీ సృష్టిస్తోంది.

స్నానాల బస్సు

శాన్‌ఫ్రాన్సిస్కో వీధి జీవితాలకు రాజధాని అని చెప్పొచ్చు. ఇళ్లు వాకిల్లు లేని ఎందరో అక్కడ రోడ్ల మీదే జీవనం సాగిస్తారు. అలాంటి చోట వారి స్నానాదులకు పబ్లిక్ టాయ్‌లెట్లు సరిపోవడం లేదు. ఈ విషయాన్ని గమనించిన డోనిస్ సాండోవాల్ అనే మహిళ లావా మాయ్ అనే ఓ సంస్థను ప్రారంభించారు. పాడైన బస్సుల్ని స్నానాల స్టాల్స్‌గా మార్చి పేదల నిత్యకృత్యాలు తీసుకునే సౌలభ్యం కల్పిస్తున్నారు. ఆ మహానగరంలో సుమారు 6500 మంది రోడ్ల మీదే బతుకుతుంటారని సర్వేలు. ప్రతి బస్సు వారానికి 2000 స్నానాలకు అవకాశమిస్తోంది. ఇక్కడే తన పని ఆగిపోకుండా ఏ టూ జెడ్ కిట్లను రూపొందించి మిగతా చోట్ల మరికొందరు ఆ ప్రయత్నం మొదలెట్టేలా ప్రోత్సహిస్తున్నారు.

అక్కడ రావణుడిని పూజిస్తారు

రావణుని వారసులమని చెబుతోన్న తెగ మధ్యభారతంలో ఉంది. దేశంలో రెండో అతి పెద్ద తెగైన గోండులకు రావణుడు రాజు, దేవుడు. పశుపక్ష్యాదులను పూజించే ఆ అడవి బిడ్డలకు అతడు ప్రకృతి దైవం. పదో ధర్మగురువుగా రావణున్ని కొలిచే గోండులు వారి పూర్వ వీరుడు, ఆది దేవుడు అయిన కుపార్ లింగో వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లినందుకు గుర్తుగా రావణ మహోత్సవాన్ని ప్రతి ఏటా నిర్వహిస్తున్నారు.



రామాయణంలోని రావణుడి తీరుకు వీరి కథలోని రావణుడి వ్యక్తిత్వానికి సంబంధం లేదు. వీరి కథలో, జానపదాల్లో ఆయనో మహావీరుడు. తమ పూర్వ రాజు. అతడి పుట్టుక శ్రీలంకలో కాదు మధ్యప్రదేశ్‌లోని అమర్ కంఠక్ వద్ద. వారికి రావణుడు బ్రాహ్మణుడు కూడా కాదు. గోండుల వంశీకుడు. వీరికి దసరా అంటే ఆయుధాల్ని పూజించే పండగ. వన దేవతగా రావణున్ని కొలిచే వీరి మహోత్సవం దసరా దగ్గరలోనే ఉంటుంది. మహారాష్ట్రలోని గడ్చిరోలి, అమరావతి, మధ్యప్రదేశ్‌లోని విదిశా, మందసార్‌లతో పాటు గోండుల జనాభా ఎక్కువగా ఉన్న గోండియా, చందర్‌పూర్, భండారలోను రావణ పూజ నిర్వహిస్తారు. 30 లక్షల మంది గోండి తెగ వారు ఉన్నా వారికి లిపి లేదు. అందుకే వారి చరిత్ర అక్షరీకరించబడలేదు. 2006 వరకు ఈ పూజను ఇళ్లల్లోనే చేసుకునేవారని తమ చరిత్ర, సంస్కృతిని సంరక్షించుకునేందుకు అప్పటి నుంచి ఓ సంఘంగా ఏర్పడి సంబరాల్ని నిర్వహించుకుంటున్నారని వారి పెద్దల మాట.

శోభాయమాన సంబరం

ద్రావిడ జాతికి ముందున్న స్థానికులుగా చెప్పబడే గోండుల జానపదాల్లో రావణుడిది ఆదర్శ వ్యక్తిత్వం. 18 సంగీత పరికరాల్ని సాధన చేయగల దిట్ట. పోరాట యోధుడు. ధర్మగురువు. అలాంటి రావణుడి కోసం వారో ప్రత్యేక సంబరం నిర్వహిస్తున్నారు. ఎంతో వర్ణనాత్మకంగా, శోభాయమానంగా సాగే ఆ సంబరాలు ఎంతో అబ్బురంగా ఉంటాయి. గడ్చిరోలిలోని పరస్వాది గ్రామంలోని వేడుక కూడా ప్రత్యేకంగా ఉంటుంది. పసుపు పచ్చటి దేహంతో ఉండే యువకుడైన రావణుడి రెండున్నర అడుగుల ప్రతిరూపాన్ని రూపొందిస్తారు. ఆ విగ్రహానికి వారి సంప్రదాయ సేల అనే షాల్‌తో అలంకరిస్తారు. గోండుల నమ్మకం ప్రకారం పసుపు రంగు సృష్టి-వినాశనాలకు సంకేతం. ఎంతో ముచ్చటగా ముస్తాబు చేసిన ఈ రావణ ప్రతిరూపాన్ని ఏనుగు వాహనంపై సవారీకి తీసుకెళతారు. వాహనాన్ని గడ్డి, బంకమట్టితో నిర్మించి రంగులతో అలంకరిస్తారు. ఇనుప చక్రాల మీద వాహనాన్ని ఊరిలోని ప్రధాన వీధుల్లో తిప్పుతూ ఊరేగిస్తారు. ఊరేగింపు మొదలు 'జై సేవా! జై రావన్నా! జై గోండ్వానా!' అంటూ నినాదాలతో ఆ గ్రామం హోరెత్తిపోతుంది. గ్రామ ప్రజల ఇళ్ల మధ్యలోకి వచ్చి దీవెనలిచ్చాక పంట భూముల వరకు ఊరేగింపు పరిక్రమ సాగి అక్కడ ఆగిపోతుంది. ఆ తర్వాత విగ్రహాన్ని తిరిగి పూజా పండాళ్లకు (మండపాలకు) తీసుకెళతారు. ఎక్కడి వరకు ఊరేగింపు సాగిందో అక్కడ ఒక ఇంద్రధనస్సు జెండాను స్థాపిస్తారు. భూమ అనే పూజారి ధాన్యపు గింజల్ని ఊరంతా చల్లుతూ అంతా శుభం కలగాలని దీవిస్తాడు. పది రోజుల పాటు నిర్వహించే ఉత్సవంలో పసుపు రంగే కీలకం. గోండులు నమ్మే ప్రతీకల్లో ముఖ్యమైన ఎద్దు కొమ్ములతో చేసిన చిహ్నాన్ని కూడా ప్రదర్శిస్తారు. మణి రావణ దుగా అనే ఉపాధ్యాయుడు గోండ్వానా గోండు సంస కృతి బచావో సమితిని స్థాపించి వారి ఆచార వ్యవహారాల్ని పరిరక్షించే ఉద్యమాన్ని చేపట్టారు. ఈ రావణ మహోత్సవం కూడా అందులో భాగమే.తమ పూర్వీకుడు, పెద్ద అయిన రావణుడి కథ, తమ చరిత్ర వక్రీకరణకు గురైందనే గోండులు వలసలు, దండయాత్రలతో తమ సంస కృతి దెబ్బతిందని చెబుతారు. ఎన్నో గిరిజన, ఆదిమ తెగలపై వారివి కానీ వేరే సంస్కృతులు బలవంతంగా రుద్దబడ్డాయి. అడవి తల్లిని, కొండ దేవతల్ని కొలిచే గోండుల సహజ సంస కృతికి

దూరమౌతున్నవారిని సంస్కరించే ఉద్దేశంతో ఆ సంస్థ 24 ఏళ్లుగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

ఇక్కడ పూజింపబడుతోంది ఆదర్శ వ్యక్తిత్వం, విలువలు, వీరత్వం ఉన్న రావణుడు. ఇతరులు పేర్కొన్న దుష్ట లక్షణాలున్న రావణుడికి వీరి ధర్మగురువు లింగోకి సంబంధం లేదని వారంటారు. ఎవరి నమ్మకం వారిది.

✦

మెటిల్డా

◆ క్లాసిక్ కథ

-గురజాడ

నేను వృక్షశాస్త్రము యమ్.యే పరీక్షకు చదువుతూ వుండే రోజులలో మైలాపురి పెద్ద రోడ్డున ఒక మిద్దె యింట్లో బస వుంటిని. నాతో పాటు పది పన్నెండుగురు విద్యార్థులు మన దేశపు వాళ్ళు ఆ మేడ యింట్లో ఉండేవారు.

నేను వచ్చిన మూడో రోజున రామారావు నన్ను సౌజ్ఞ చేసి పిలిచి రహస్యంగా “మెటిల్డాను చూశావా?” అని అడిగాడు. లేదన్నాను. ‘అదుగో... చూసీ చూడనట్టు చూడు’ అని చూపించాడు.

చూశాను.

మెటిల్డా వైపు తిప్పిన మొహం తిప్పకుండానే “యెలా రావడం. కళ్ళు భగవంతుడు యిచ్చినందుకు యిదే కదా ఫలం– మనోహరమైన భగవంతుడి సృష్టిలోకల్లా మనోహరమైనది సొగసైన స్త్రీ. మనస్సులో చెడు చింత లేనప్పుడు చూస్తే తప్పేమి?” అన్నాను.

“నీలా శ్రీరంగనీతులు చెప్పిన వాళ్ళని చాలా మందిని చూశాను. కొత్తవాడివి యెరిగివుంటే మంచిదని చూపించాను. మరి యెన్నడూ యిల కన్ను తిప్పకు” అని రెక్క పట్టుకు గెంటుక పోయినాడు.

‘మంచి మనిషా, చెడ్డ మనిషా?’ అని అడిగాను.

“మంచయితే మనకేల? చెడ్డయితే మనకేల? ఒకర్ని మంచి కాదండానికి మన మంచేం తగలడుతూంది? మెటిల్డా వైపు చూడవలెనని తిరిగి యెన్నడైనా చూస్తివా! నీకూ నాకూ నేస్తం సరి” అన్నాడు. రామారావు నాకు ప్రాణసమానమైన మిత్రుడు. యేం చెయ్యను, మనసు నిరోధించి మెటిల్డా యింటి పెరటి వేపు వున్న డాబా పొంతకు నే వెళ్ళలేదు, కొన్నాళ్ళు.

పసుపు రాసుకొని స్నానమాడిన పైని బంగారు చాయలు దేరిన మేని సొంపు, నెమలి పింఛమువలె ఒడలును కమ్మి చెదిరిన తలకట్టూ, బావి నుంచి నీరు తోడిన వయ్యారమూ, తోడుతూ వొక్కొక తరి తలయెత్తి యిటు అటూ చూసిన కన్నుల తళుకూ, మోము అందమూ నా కన్నులు కట్టినట్టు వుండి మరుతునన్న మరపు రాకపాయను. వారం పది రోజులు కట్టు మీద ఉన్నాను. ఆపైన మనసు పట్టలేక పచారు చేస్తూ చదివే మిష మీద, చేత పుస్తకం, దృష్టి పెరటి వైపూ వుంచి డాబా మీద గస్తు తిరిగే వాణ్ణి రామారావు యింట లేనప్పుడు.

ఆ రోజుల్లో రెండు మార్లే యేదో పని మీద పెరట్లోకి వచ్చి వెంటనే యింట్లోకి వెళ్ళిపోతూ వచ్చింది. మెరుపులా.

కాలేజీకి వెళ్ళేటప్పుడు మెటిల్డా యింటి యెదట చీమలాగ నిమ్మళంగా ఆ యింటివేపు చూస్తు నడిచేవాణ్ణి అప్పుడప్పుడు చిత్తరపు చట్రంలా ప్రతిమ లాగ, గవాక్షంలోంచి మెటిల్డా కనపడేది.

• • •

మెటిల్డా చరిత్ర అడిగి వారి వల్లా, వీరి వల్లా, అడక్కుండా నా నేస్తాల వల్లా గ్రహించాను. మెటిల్డా పెనిమిటికి మా వాళ్ళు పులి, ముసలి పులి అని పేరు పెట్టారు. అంత ముసలివాడు కాడు. యాభై అయిదు, యాభై ఆరు యీడు వుండువచ్చును. కొంచెం తెల్లగా, పొట్టిగా వుంటాడు. పెద్ద కళ్ళూ, కోర మీసాలు, స్ఫోటకం మచ్చల మొహం రెండేళ్ళాయ వచ్చి మా ప్రక్క బంగళాలో బసవేశాడు. యెక్కణ్ణించి వచ్చాడో యెందుకు వచ్చాడో యెవరూ యెరుగరు. వీధి వేపు పెరటిలోకి వొరసుకొని పెద్ద గది వొకటి వుంది. దానిలో మూడు బీరువాలతో పుస్తకాలు వున్నాయి. అమేషా రాస్తూనో, చదువుతూనో కనుపడేవాడు. వీధి పెరటిలోనూ, వెనక పెరటిలోనూ పూల చమన్ బహు సొగసుగా వుంచేవాడు. ఉదయం, సాయంత్రం మొక్కలకు గొప్పు తవ్వేవాడు. మెటిల్డా మొక్కలకి నీరు పోసేది. ఇది యింగ్లీషు పద్ధతి ప్రకారం యిద్దరికీ శరీర వ్యాయామం. అంతే మరి యిల్లు కదలి నాలుగు అడుగులు పెట్టడమన్నది లేదు. యింటికి చుట్టాలూ, పక్కాలూ రాకపోకలు యెన్నడూ లేదు. పులి మెటిల్డాని యెక్కువ కాయిదా పెట్టేవాడు. గుమ్మంలోకి రాకూడదు అని శాసనంట. గాని అప్పుడప్పుడు వచ్చేది. ఆ పిల్ల మొఖాన వొక మోస్తరు విచారం కనపడేది. వింతేమి? మొగుడు కంట్రక పెట్టేవాడు. మొగుడి అప్ప (అక్క) ఒక ముదసలి, చిలిపి జగడాలు పెట్టేది. ఇంటిలో మిగిలిన వాళ్ళు ఒక ముసలి వంట బ్రాహ్మణుడు.

మెటిల్డా పెనిమిటిని పులి, పులి అనడమే గాని అతని పేరేమిటో యెవడూ యెరగడు. పోస్టు బంట్రోతు ఆయన పేర వచ్చిన ఉత్తరముల పై విలాసం ఎవరికీ చూపకుండా నిర్ణయం అట. ఒక్క పోస్టు మేష్టరికీ, పులికీ మాత్రం పరిచయం వుందని అనుకునేవారు.

అది రహస్యం



కాపాడడం కోసమే ఉంటుంది.

• • •

ఒకనాడు అభ్యంగనమై జుత్తు విరయబోసి, షోకుగా టోపీ తలనమర్చి, మల్లిపువ్వు లాంటి బట్టలు కట్టి బరికి పోతూ, మెటిల్డా యింటి యెదట జాలంగా నడుస్తూ వుంటిని. అంతట గుమ్మం దగ్గిరికి వచ్చి ఆమె వైపు చూస్తూ నిలిచిపోయినాను. అర మినుటు కావచ్చు, పులి గుహలోంచి పైకి దుమికి "అబ్బాయి యిలారా" అన్నాడు. తంతాడేమో పరుగుచ్చుకుందాము అనుకున్నాను. గాని అట్టి పని చేస్తే నాయందు నేరం నిలవడం కాకుండా మెటిల్డా యందు నేరం నిలుస్తుందేమో? నాకు యేమైతే ఆయను, ఆమెను కాపాడదామని వెళ్ళాను.

లైబ్రరీ గదిలోకి తీసికెళ్ళాడు. కుర్చీ మీద కూలబడి రౌద్రాకారమైన చూపుతో యింగ్లీషున అడిగాడు?

"నా పెళ్ళాం వైపు చూస్తున్నావా?"

"కిటికీ లోంచి కనపడుతూండే మీ లైబ్రరీ చూస్తు మీరు యెటువంటి మనుష్యులు, యేమి చేస్తుంటారు అని ఆలోచిస్తున్నాను"

"నా పెళ్ళాన్ని చూడలేదూ?"

"చూశాను. యెదట నిలుచుంటే కనపడరా, అంతే"

పిడుగులాగ 'ఔనే! ఔనే!' అని పిలిచాడు. మెటిల్డా రాలేదు. 'వొస్తావా రావా లంజా!' అన్నాడు. వొణుకుతూ మెల్లగా వచ్చి తల వొంచుకు నిలబడ్డది. యింగిలీషున నాతో మళ్ళీ అన్నాడు.

"ఓ తెలివి తక్కువ దద్దమ్మా- చూడు యెంత సేపు చూస్తావో. యీ ముండ మొహం వేపు. యేం నా వేపు చూస్తావేం, దాని వేపు చూడక? నా మొహం దాని మొహం కన్నా బాగుందనా?"

నేను మాట్లాడలేదు. కథ బాగుంది కాదని, కాలు గుమ్మం వేపు సాగించబోతూండగా, కనిపెట్టి మెల్లగా 'వుండు' అన్నాడు.

నిలిచాను.

నిమిషం కిందట కన్నుల రాలిన నిప్పులు చల్లారాయి.

"అబ్బాయి" అన్నాడు.

" నిజవాడ్డం యెన్నడైనా నేర్చావా?" తల్లిదండ్రుల దగ్గిర గాని గురువుల దగ్గిర గాని" నా తల్లీ తండ్రీ తలపుకు వచ్చారు.

"నేర్పవలసిన అవసరం లేకుండా నిజాయితీ నాకు పుట్టుకతోనే వచ్చింది" అన్నాను.

"అయితే పుట్టకతో పుట్టిన ఆ నిజాయితీ చూదాం, చెప్పు నా పెళ్ళాం అందంగా వుందా లేదా?"

"ఆమె అందంగానే వున్నాదనుకుంటాను"

"సంశయవేవైనా వున్నదా?"

"లేదు"

తోవంట వెళ్ళేటప్పుడు రోజూ, దానికోసం యీ వేపు చూస్తు వుంటావా లేదా?

నిజమాడమన్నారు గనుక వొప్పుకోక విధి లేదు. చూస్తున్నానుగాని, చెడ్డ తలపు మనసులో యీషత్తు వుంటే దేవుడు సాక్షి?

దాని మాటకేం- అది కంటికిక్కనపడితే నీకు ఆనందం అవునా కాదా? నిజవన్నదేదీ?

అవును

"అయితే ఈ ముండని తీసుకుపో – నీకు దానం చేశాను తీసుకో, నాకు శని విరగడై పోతుంది".

నేను మాటడకుండా కదలి పైకొచ్చాను. యిళ్ళు కనపడలేదు. మనుషులు కనపడలేదు. శృంగభంగమై నన్ను నేను దూషించుకుంటూ బరికి పోయినాను.

అక్కడ బస యెత్తెయడానికి నిశ్చయించాను. బస యెత్తేసి మరి ఆ వీధి మొహం చూడకూడదనుకున్నాను.

నా కళ్ళకి కట్టినట్లు ఆ వొంచిన మొఖం. బిందువులుగా స్రవించిన కన్నీరు. కాచుకొన్న నిట్టూర్పుల చేత కంపించిన రొమ్ము- యే మహాకవి రచనలోనూ లేదనగలను, అగాధమై ప్రౌఢమైన కరుణ రసం ఆ సరిలేని సొగసున్ను.

• • •

నే బసవున్న యింటి గుమ్మం దగ్గిరకి వచ్చేసరికి పులి యింటి ముసలి బ్రాహ్మణుడు సన్నసన్నగా నా చేతులో ఒక చీటి పెట్టి జారిపోయినాడు. ఇందాకటి కథతో దీనికేదో సంబంధం ఉందని తలచి నా గదిలోనికి వెళ్ళి లోపల గడియ వేసుకొని చీటి చదువుకొన్నాను. దానిలో యేముందీ?

కుదురైన అక్షరాలతో

"మీరు మీ నేస్తులూ నా కాపరం మన్ననివ్వరా? మీకు నేనేం అపకారం చేశాను? తల వంచుకు మీ తోవను మీరు పోతే నే బతుకుతాను. లేకపోతే నా ప్రారబ్ధం"

యేమి చెయ్యను? అక్కడ బస విడిచి మరివక చోటికి పోతే, నా మట్టుకు చిక్కు వొదులు తుందనుకుంటిని గదా? యిప్పుడు మెటిల్డా చేసిన విన్నపం యెలా తొలగి వెళ్ళిపోదును? నా స్నేహితుల వల్ల ముప్పు కలక్కుండా ఆమెను కాపాడవద్దా? కాపాడగలనా?

మెటిల్డాను కాపాడలేకపోతే బతుకేమిటి? పౌరుషమేవిటి? ఈ మనోజ్ఞమైన స్త్రీ రత్నం యొక్క చిత్రకథలో దు:ఖ భాజన కథలో, నేను కూడా చేరానా? దు:ఖం మళ్ళింది. యీ అందకత్తె మనసుతో మెప్పుకొంటే జన్మసార్థకమవుతుంది. ఈ సొగసైన లిపి మెటిల్డా రాసినదా? యేమి అదృష్టవంతుణ్ణి? మెటిల్డా యేమి రాస్తే చెయ్యను. త్రైలోక రాజ్యం నాకుండి యిమ్ము అంటే పట్టం గట్టనా?

గాని యిప్పుడు యేం చేతును? నాకు లోకజ్ఞానం తక్కువ. వినాయకుని చెయ్యి బోయి



కోతిని చేస్తానేమో? రామారావు అనుభవజ్ఞుడు, గుణవంతుడు, నేర్పరి, చెప్పిన మాట విననందుకు చివాట్లు పెడితే పడతాను. నా ఉద్యమంలో సాయం చెయ్యమని కాళ్ళు పట్టుకుంటాను.

అని ఆలోచించి రామారావుకు పూస గుచ్చినట్లు కథంతా చెప్పాను. నా నిశ్చయం యిదని తెలియచేశాను. మళ్ళించ ప్రయత్నించవొద్దని గెడ్డము పట్టుకు బతిమాలాను. రామారావన్నాడు. “మళ్ళించగలనని నమ్మకం వుంటే మళ్ళించజూతును, మళ్ళవని యెరుగుదును. చూడవద్దంటే చూడడం మానితివా?”

గాని నాకు తోచిన మాటా, నాకు తెలిసిన మాటా నీకు చెప్పకపోతే నేను అపరాధిని అవుతాను, స్నేహాన్ని తప్పిన వాణ్ణి అవుతాను.

ఆలు మొగుళ్ళ దెబ్బలాటల్లోకి వెళ్లవద్దని మన పెద్దల శాసనం. అవి అభేద్యాలు, అగమ్య గోచరాలు. మధ్యవర్తులు కాపరం చక్కచేదామని చెక్కలు చేసి వెళ్ళిపోయి వస్తారు” ఒకటి.

“పులి పులి అని మనం యెంత పేరు పెట్టినా పాపం యీ పులి అరుపే కాని కరువు లేదు. మెటిల్డాని యెన్నడైనా ఒక్క దెబ్బ కొట్టాడని విన్నామా? లేదు. తిండికి లోపం లేదు. గుడ్డకి లోపం లేదు. అతను చెప్పినట్టు మెసులుకుంటే నెమ్మదిగా కాలం వెళ్ళడానికి అభ్యంతరం లేదు” – రెండు

“యిక మూడోది. నీకు మెటిల్డా మీద మనస్సు గట్టిగా లగ్నం అయింది. అది కూడని పని. చెడ్డ తలంపు లేనప్పుడు యేమి ఫర్వా అని అనగలవు. చెడ్డ తలంపు చెప్పి రాదు. యెక్కణ్ణించో రానక్కర్లేదు. కంటికక్కనపడకుండా మనసులో ప్రవేశించి పొంచి వుంటుంది. చూసీ చూడనట్టు మనం వూరుకొని అది పైకొచ్చే ప్రయత్నాలు బాహాటంగా చేస్తూ వుంటాం. చెడ్డ తలపులకి గుర్తు యెవరైనా వుండాలి కదూ. అడవిలో వొంటరిగా వున్న వారికి స్త్రీల విషయమై చెడ్డ తలపులు ఉండవు. సొగసైన స్త్రీల పొందు కోరేవాడికి అవకాశం తటస్థించినప్పుడు చెడ్డ తలపు వస్తుందా రాదా అని ఆలోచన. ఆ అవకాశానికి అవకాశం యివ్వని వాడె ప్రాజ్ఞుడు”.

• • •

“నాకూ నీవూ, నీ స్నేహితుడు రామారావు మరొక గొప్ప వుపకారం చేశారు. మీ మాటలవల్లా చేష్టల వల్లా నా భార్య యోగ్యురాలని తెలుసుకొన్నాను. ఆలోచించుకోగా ఆనాటి నుంచి కళ్లెం వదిలేశాను. నా పెళ్ళాం బహు బుద్ధిమంతురాలు. యిచ్చిన స్వేచ్ఛనైనా పుచ్చుకోలేదు. యెక్కడికి కావాలిస్తే అక్కడికి వెళ్ళమన్నాను. యెవరిని కావలిస్తే వారిని చూడమన్నాను. యెక్కడికి వెళ్ళకోరలేదు. యెవర్నీ చూడకోరలేదు. నాకు నీతో లోకం. మరి యెవరితో యేం పనంది. అలాగే సంచరించింది.

దాని చర వొదిల్చావు. అది నా చర కూడా వొదలడానికి కారణమైంది. హయ్యరు మాథమిటిక్సు చదువుకున్నావా? లేదు పోనియ్యి.”

కాల్‌బెల్ టింగ్ మని వాయించాడు. కీలు బొమ్మలాగా మెటిల్డా ప్రవేశించి గుమ్మం లోపున నిలబడింది.

“కాఫీ యియ్యి”

బల్ల మీద రెండు గిన్నెలతో కాఫీ అమర్చింది.

“నీక్కూడా పోసుకో”

మొగుడు కేసి “కూడునా యిలాంటి పని” అనే అర్థంతో చూసింది.

“పర్వాలేదు నువ్వు కూడా తాగు. మన స్నేహితుడు” అన్నాడు. గాని ఆమె తనకు కాఫీ అమర్చుకోలేదు. ప్రక్కన నిలుచుంది.

“పోనియి. కూచో” అన్నాడు, కూచోలేదు. నేను భార్తాభర్తల సరాగానికి సంతోషించాను. నేను అందుకు కొంత కారణభూతుణ్ణి కదా అని మెచ్చుకున్నాను.

కాఫీ పుచ్చుకున్నంత సేపూ అతను చెప్పిన మాటలు తన భార్యకు చదువు చెబుతున్నాననీ, అమేషా రామాయణం, భారతం చదువుతున్నట్టుందనీ, తను ఫలానా, ఫలానా చోటికి తీసుకువెళ్ళాననీ, కులాసా దిలాసా చూపించానని. అంతట నా చదువు మాట కొంత. చాలా విద్వాంసుడని కనుక్కున్నాను.

వెళ్ళిపోయేముందు “మరి నువ్వు వెళ్ళిపో”...

(నవంబర్ 30 గురజాడ నూరవ వర్ధంతి సందర్భంగా...)

నవ్వుల్ – పువ్వుల్

ఐరన్ టానిక్



భర్త: ఏమే కాంతం... నాకెందుకో భయంగా ఉందే.

భార్య: ఎందుకు.....??

భర్త: మరి నెల రోజుల నుండి ఐరన్ టానిక్ వాడుతున్నాను కదా... పేగులు తుప్పు పట్టిపోతాయేమోనని....

ఆలస్యం

టీచర్: బడికి ఇవాళ ఆలస్యమయ్యిందేం రా?

స్టూడెంట్: బడికి ఆలస్యంగా రానని... వందసార్లు ఇంపోజిషన్ రాయమన్నారుగా. అది రాయటం వల్లే ఆలస్యం అయ్యింది మేడమ్!!

రెండో ఆపిల్

రాజేష్: న్యూటన్ ఆపిల్ పండు కింద పడగానే కిందకు ఎందుకు పడిందని ఆలోచించాడు. మరి నువ్వైతే.

గిరీష్: పండు పడగానే తినేసి రెండోది ఎప్పుడు పడుతుందా..అని ఆలోచిస్తాను.

బాధ

ఫుల్‌గా తాగి ఇంటికొచ్చాడు పరమేశం

అంబిక: ఏంటండీ..రాత్రి పన్నెండయింది. పైగా మన పెళ్ళి రోజు. ఇలా తాగొచ్చారేంటీ? (కోపంగా అంది)

పరమేశం: అవును అంబీ ఆ బాధను మర్చిపోవడానికి ఇలా తాగొచ్చాను.

బస్సారు

కావాల్సిన పదార్థాలు
కందిపప్పు- వంద గ్రాములు, తోటకూర కట్టలు- రెండు, సోంపు ఆకు- రెండు కట్టలు, చింతపండు-ఐదు గ్రాములు, టమాటా- పెద్దది ఒకటి, వెల్లుల్లి రెబ్బలు-ఐదు, జీలకర్ర- చెంచా, సాంబారు పొడి-రెండు చెంచాలు, కొత్తిమీర - కొద్దిగా, కరివేపాకు రెబ్బలు- నాలుగు, నూనె- రెండు చెంచాలు, పసుపు- కొద్దిగా, ఆవాలు-చెంచా, పచ్చిమిర్చి -ఆరు, ఉప్పు- సరిపడినంత

తయారీ
ఆకుకూరలను కడిగి తరిగి పెట్టుకోవాలి. ముందు కందిపప్పు పొయ్యి మీద ఉడికించాలి. కాస్త మెత్తగా అవుతున్నప్పుడు మూడు చెంచాలు తీసి విడిగా పెట్టుకోవాలి. ఇప్పుడు అందులో ఆకు కూరల తరుగు చేర్చాలి. అవి కూడా మెత్తగా ఉడికాక ఆ పప్పు కట్టును మరో పాత్రలోకి తీసుకోవాలి. ఇప్పుడు కొత్తిమీర ముందుగా తీసి పెట్టుకున్న పప్పు, జీలకర్ర, వెల్లుల్లి రెబ్బలు, టమాటా ముక్కలు, చింతపండు తీసుకొని మరీ మెత్తగా కాకుండా మిక్సీలో వేసి రుబ్బుకోవాలి. బాణలిలో పసుపు, పచ్చి మిర్చి వేయించి పప్పుకట్టు, రుబ్బి పెట్టుకున్న మసాలా, సాంబారు పొడి తగినంత ఉప్పు వేసి ఉడికించి దింపేయాలి.

కన్నడ ఘుమఘుమలు

అనపకాయ పులుసు

కావాల్సిన పదార్థాలు
అనపగింజలు (ఇవి చిక్కుడు గింజల్లా ఉంటాయి. గింజలు ఒలుచుకోవాలి)-పావు కేజీ, పచ్చి కొబ్బరి- సగం చిప్ప (తురుము కోవాలి) బంగాళాదుంపలు-రెండు, వంకాయలు-రెండు, బీన్స్-150 గ్రాములు, టమాటా-ఒకటి, కొత్తిమీర-కట్ట, సెనగపప్పు-నాలుగు చెంచాలు, ధనియాలు-రెండు చెంచాలు, దాల్చిన చెక్క-చిన్నవి రెండు, లవంగాలు-నాలుగు, పసుపు-పావు చెంచా, ఎండు మిర్చి-ఐదు, ఉప్పు-తగినంత, నూనె-నాలుగు చెంచాలు, ఆవాలు-అర చెంచా, జీలకర్ర-అర చెంచా, కరివేపాకు రెబ్బలు-రెండు, ఇంగువ-కొద్దిగా, చింతపండు రసం-రెండు చెంచాలు.

తయారీ
ముందుగా సెనగపప్పు, ధనియాలు, లవంగాలు, దాల్చిన చెక్క, ఎండు మిర్చి రెండు చెంచాల నూనెలో దోరగా వేయించుకోవాలి. ఈ మిశ్రమాన్ని కొబ్బరితో కలిపి మెత్తగా రుబ్బుకోవాలి. కాయగూరలు తరిగి అనపగింజలతో కలిపి తగినంత ఉప్పు వేసి మెత్తగా ఉడికించుకోవాలి. ఇప్పుడు ఈ గింజల్లో చింతపండు రసం, ముందుగా సిద్ధం చేసి పెట్టుకున్న మిశ్రమం తగినంత ఉప్పు చేర్చి పొయ్యి మీద పెట్టాలి. పది నిమిషాలయ్యాక కొత్తిమీర చల్లి దింపేయాలి. బాణలిలో నూనె వేడిచేసి ఆవాలు జీలకర్ర, కరివేపాకు, ఇంగువ, పసుపు వేయించి పులుసుపై వేయాలి. ఇది అన్నం, చపాతీ, పూరీల్లోకి బాగుంటుంది.

కాయ హోళిగ

కావాల్సిన పదార్థాలు

కొబ్బరికాయ - ఒకటి, బియ్యం- రెండు చెంచాలు, మైదా, పేనీరవ్వ- పావు కేజీ చొప్పున, బెల్లం-అర కేజీ కన్నా కొద్దిగా తక్కువ, యాలకులు-నాలుగైదు, నూనె-కప్పు

తయారీ
మైదా, పేనీరవ్వను చపాతీపిండిలా కలిపి నాననివ్వాలి. కొబ్బరిని సన్నగా ముక్కలు తరిగి అందులో బియ్యం వేసుకుని మెత్తగా అయ్యేలా మిక్సీ పట్టాలి. పొయ్యిమీద పాత్రపెట్టి కాసిని నీళ్ళు పోసి బెల్లం పాకం పట్టాలి. ముదురు పాకం వచ్చాక కొబ్బరి తురుము, యాలకుల పొడి చేర్చి బాగా కలిపి దింపేయాలి. కలిపి పెట్టుకున్న మైదాపిండిలో పావు కప్పు నూనె చేర్చి మరోసారి బాగా కలపాలి. ప్లాస్టిక్ కవర్ మీద కొద్దిగా మైదాను తీసుకుని వత్తి అందులో కొబ్బరి మిశ్రమాన్ని ఉంచి చుట్టూ మూసి మళ్ళీ పల్చగా అద్దాలి. ఇలా చేసుకున్న వాటిని నూనె లేదా నెయ్యితో కాల్చితే కమ్మని హోళిగలు నోరూరిస్తాయి.

బిసీ బెళె బాత్

కావాల్సిన పదార్థాలు
బియ్యం-పావు కేజీ, కందిపప్పు-కప్పు, క్యారెట్, బంగాళా దుంపలు-రెండు చొప్పున, బఠాణీలు-పావు కప్పు, బీన్స్-నూటయాభై గ్రాములు, టమాటా- ఒకటి, ఉల్లిపాయలు-నాలుగు, ఉప్పు-రుచికి తగినంత, నెయ్యి-యాభై గ్రాములు, పసుపు-కొద్దిగా, నూనె-మూడు చెంచాలు, చింతపండు-పాతిక గ్రాములు, ఆవాలు-జీలకర్ర-అర చెంచా చొప్పున, కరివేపాకు రెబ్బలు-రెండు, ఇంగువ-కొద్దిగా, జీడిపప్పు పలుకులు-పావు కప్పు

మసాలా కోసం
ధనియాలు, మినప్పప్పు, కందిపప్పు-నాలుగు చెంచాల చొప్పున, సెనగపప్పు-రెండు చెంచాలు, ఎండుమిర్చి-పది, మరాఠీ మొగ్గ, దాల్చిన చెక్క-మూడు చొప్పున, లవంగాలు-నాలుగు, యాలకులు-ఒకటి, కొబ్బరి తురుము-కప్పు

తయారీ
కొబ్బరి తురుము తప్ప మసాలా దినుసులన్నింటినీ నూనెలో వేయించుకుని చల్లారాకా పొడి చేసుకోవాలి. అందులో కొబ్బరి తురుమును చేర్చాలి. చట్నీలా తయారైన దీన్ని పక్కన పెట్టుకోవాలి. బియ్యం, కందిపప్పు, కూరగాయ ముక్కలన్నింటినీ కుక్కర్‌లో తీసుకుని పొయ్యి మీద పెట్టాలి. ఒక కూత వచ్చాక దింపేయాలి. ఆ అన్నాన్ని మళ్ళీ పొయ్యిమీద పెట్టి ఉడికించాలి. ఐదు నిమిషాలయ్యాక చింతపండు గుజ్జు చేర్చాలి. ఇప్పుడు పసుపు, ఉప్పు వేయాలి. సిద్ధం చేసుకున్న మసాలా కూడా చేర్చి బాగా కలపాలి. ఇది కాస్త పలుచగానే ఉండాలి. కాసిని నీళ్ళు చేర్చుకోవాలి. అన్నం తయారయ్యాక దింపేయాలి. బాణలిలో నెయ్యి కరిగించి ఇంగువ జీడిపప్పు, కరివేపాకు, ఆవాలు, జీలకర్ర వేయించి ఈ అన్నంపై వేసి కలుపుకోవాలి.బిసీ బెళె సిద్ధం.

సీతాకోకచిలుక బొమ్మ పూరిద్దాం

ఆర్టిస్టు అంకుల్ సీతాకోక చిలుక బొమ్మను సగం గీసి వదిలేశాడు. మిగతా భాగాన్ని మీరు పూర్తి చేస్తారు కదూ.



పదాలను గుర్తించండి

ఈ చిత్రంలో చాలా అక్షరాలు వున్నాయి కదా. కింద వస్తువులు, వాటి పేర్లు ఇచ్చాం. మరి ఆ అక్షరాలలో అవి ఎక్కడ దాక్కున్నాయో గుర్తించండి.

I	N	O	T	E	P	A	D	M	G
C	R	A	Y	O	N	B	F	A	L
S	K	J	E	R	A	S	E	R	U
C	X	S	V	Z	B	O	O	K	E
I	W	T	A	C	K	M	O	E	F
S	H	A	R	P	E	N	E	R	O
S	T	P	E	N	C	I	L	J	L
O	A	L	C	H	A	L	K	P	D
R	P	E	Y	Q	S	T	J	E	E
S	E	R	U	L	E	R	U	N	R

బుజ్జిస్టార్

హాయ్ ఫ్రెండ్స్ ! నేను తెలుగు సినిమా 'కిక్' హీరోయిన్ని. ఇది నా చిన్న నాటి ఫోటో...నేనెవరో కనిపెట్టి చెప్పండి.

మన కరెన్సీ

మీరు ఎప్పుడైనా మన కరెన్సీ నోట్లను గమనించారా అన్ని నోట్ల మీద 17 భాషలు వాటిపై ముద్రిస్తారు?

ఆ భాషాల వరుస ఇంగ్లీష్‌లో 'ఏ' నుండి 'జడ్' క్రమంలో ఉంటాయి. అవి 1) అస్సామీస్, 2) బెంగాలీ 3) గుజరాత్ 4)కన్నడ 5)కాశ్మీరీ 6) కొంకణి 7) మలయాళం 8) మరాఠీ 9) నేపాల్ 10)ఒరియా 11) పంజాబీ 12) సంస్కృతం 13) తమిళ్ 14) తెలుగు 15)ఉర్దూ. ఒక భాషా ప్యానెల్ లో ఈ 15 భాషాలతో పాలు మన జాతీయ భాష హిందీ మరియు ఇంగ్లీష్ ఉంటాయి.



చామర్తి వెంకట రామకృష్ణ

ఆరు తేడాలు గుర్తించండి

పార్కులో నెమళ్లు ఆడుకుంటున్న దృశ్యాలు రెండూ అచ్చుగుద్దినట్టు ఒకేలా వున్నాయా! కానీ రెంటిలో ఆరుపైగా తేడాలున్నాయి. వాటిని గుర్తించండి సున్నా చుట్టండి.



ఇంటిని అటు తిప్పండి

ఈ ఇంటిని 10 అగ్గిపుల్లలతో చేశారు. అయితే ఇంటి ముఖద్వారాన్ని అటు వుండేలా మార్చాలి. అందుకోసం కేవలం రెండు పుల్లలను మాత్రమే కదల్చాలి.

పొడుపు కథలు

చెయ్యని ఉండ
పొయ్యని నీళ్లు
వెయ్యని సున్నం
తియ్యగ నుండు



పొట్టి వాడికి
పుట్టెడు అంగీలు

బారెడు రెక్కలున్నా...ఎగరలేదు

కగూ పక్షి దక్షిణ పసిఫిక్ మహా సముద్రంలోని న్యూ కాలడోనియా దీవిలో మాత్రమే కనిపిస్తుంది. అంతరించిపోయే దశలో ఉన్న ఈ పక్షుల సంఖ్య కేవలం 250 నుంచి 1000 మధ్యే ఉంది. పెద్ద పెద్ద రెక్కలున్నా ఇవి మిగతా పక్షుల్లా ఎగరలేవు. అటవీ ప్రాంతంలో సంచరించే ఇవి రెక్కల్ని వేగంగా పరుగు తీయడానికి ఉపయోగిస్తాయి. చూడటానికి పావురాయిలా కనిపించినా ఇవి చాలా ప్రత్యేకంగా ఉంటాయి. మనం పసిగట్టే లోగా అవి వేగంగా వెళ్లిపోవడం వల్ల వాటిని ఘోస్ట్ ఆఫ్ ది ఫారెస్ట్ అని పిలుస్తారు.

- లేత బూడిద రంగు, నీలి బూడిద రంగుల్లో ఉండే వీటికి ఎర్రని ముక్కు, కాళ్లు ఉంటాయి.
- వాటి తలకు ఈకలు కిరీటంలా చాలా చూడ ముచ్చటగా ఉంటాయి.
- 55 సెం.మీ. పరిమాణంలో ఉండే ఇవి కేజీ వరకు బరువు ఉంటాయి.
- వీటి రెక్కలు 75 సెం.మీ. వరకు ఉన్నా బలమైన కండరాలు లేకపోవడంతో ఇవి మిగతా పక్షుల్లా ఎగరలేవు.
- పురుగులు, బల్లులు, తొండలు, నత్తలు వంటివి వీటి ఆహారం.
- వీటికి ఉండే పెద్ద కళ్ల వల్ల బైనాక్యులర్ చూపు కలిగి దూరంగా ఉన్న ఆకులు, బొరియల్లోని చిన్న చిన్న కీటకాల్ని కూడా జూమ్ చేసి చూడగలవు.

- మిగతా పక్షులు వేటికి లేని విధంగా వీటి శ్వాస రంధ్రాలకు ప్రత్యేకమైన పొరలు ఉంటాయి.
- ఉదయాన్నే జంట పక్షులు డ్యూయెట్లు పాడతాయి. ఒక్కో డ్యూయెట్ 15 నిమిషాల పాటు సాగుతుంది.

ఆలోచింపజేసే కథలు

"**లై**ఫ్ ఇన్ ఏ కాలేజ్" పేరుతో 1975లో కథల సంకలనం ప్రచురణైంది. నవీన్ 80 పైగా కథలు దాదాపు 6 సంకలనాలుగా వెలువడ్డాయి. "మన రచనల వల్ల కనీసం ఒక్క మనిషి మారినా రచయితలుగా జన్మ ధన్యమైనట్టే" అంటాడు ప్రముఖ కథా రచయిత బుచ్చిబాబు. నవీన్ కథలు చదివి "మమ్మల్ని మేం సంస్కరించుకున్నామని" ఎందరో చెప్పారు. "ముక్తానుషంగం" అంటూ రాంభట్ల కృష్ణమూర్తిగారు "వైవిధ్యం నవీన్ కథల్లో ప్రధానాంశం" అంటూ కె.పి. అశోక్ కుమార్ ముందు మాటలు రాశారు. "లైఫ్ ఇన్ ఏ కాలేజ్" విభాగంలో 12 కథలు, "ఎనిమిదో అడుగు"లో 20 కథలు మొత్తం 32 కథలు. ఇవి యూత్ కాలేజి లైఫ్‌ను ప్రతిబింబించేవిగా ఉన్నా కొన్ని ఫ్రాయిడ్ చైతన్య స్రవంతిని సాహిత్య సాధనంగా స్వీకరించారనిపిస్తుంది. అశోక్ కుమార్ అన్నట్లుగా నవీన్ కథలను ఫెమినిస్ట్ కథలు వివాహవ్యవస్థ మానవ సంబంధాలు దోపిడీ చూపే కథలు. మనో విశ్లేషణ కథలుగా ఉన్నాయని అంటారు. ఇందిరమ్మ ఎమర్జెన్సీ నవీకరించిన గొప్ప నవలాకారుడు నవీన్‌గారు. ఇక ఈ సంపుటి శిక్ష పరిహారం, ఎనిమిదో అడుగు కథలు లైంగిక దోపిడీని సమర్థంగా ఎదుర్కున్న నాయికలను పరిచయం చేస్తాయి. ఈ కథలు ఫెమినిస్ట్ ఉద్యమం ఊపందుకోక ముందే నవీన్ గారు రాయడం విశేషం. ఇంగ్లీషు, హిందీ, తమిళం, కన్నడ, మరాఠీ, సంస్కృతంలో వీరి కథలు అనువాదమైనాయి. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అనే సత్యాన్ని "డబ్బు మనిషి" తెర కథల్లో చాలా సహజంగా రాశారు. కాలేజి యువత జీవితాన్ని అద్దం పట్టే కథ, 'లైఫ్ ఇన్ ఏ కాలేజి' మినీ నవల అనవచ్చునేమో! 'ట్యూషన్ మేష్టారు" కథగా మధ్య తరగతి కుటుంబ గాథలు రాశారు. బహు కుటుంబీకునిగా ట్యూషన్ మేష్టారును రచయిత చూపారు. ఐదుగురు ఆడపిల్లలు, నలుగురు మగ పిల్లలు, మళ్ళీ భార్య కడుపుతో ఉండటం..ఆనాటి కాలంలో గర్భనిరోధక పద్ధతులు పాటించని వైనాన్ని తెలియజేస్తుంది. విద్యార్థుల పట్ల టీచర్ చాలా కఠినంగా ఉండే స్థితిని ఈ కథలో చెప్పడం వాస్తవానికి దగ్గరగా ఉంది. కథల్లోని చైతన్య స్రవంతి ధోరణి ఆకట్టుకుంది. పాత్రల మానసిక విశ్లేషణలో నవీన్ కథలో ప్రత్యేక స్థానాన్ని విశిష్టతను కలిగి ఉంటాయి.



అంపశయ్య నవీన్ కథలు
రచన: అంపశయ్య నవీన్
పేజీలు: 488/-, వెల: 325/-
ప్రతులకు: నవ చేతన పబ్లిషింగ్ హౌస్
గిరి ప్రసాద్ భవన్,
బండ్లగూడ, హైదరాబాద్

తంగిరాల చక్రవర్తి

శృంగారాన్ని, హాస్యాన్ని పండించిన కథలు

కవి కొండల వెంకటరావు గారు తెలుగు వాఙ్మయంలో విస్తారంగా రచనలు చేశారు. మొదటి తరం సుప్రసిద్ధ కథానికా రచయితలలో ఒకరు. వీరి కథలు 1929లో వచ్చాయి.దాదాపు 300 కథలు రాశారు. యాత్రా స్థలాలు చరిత్ర కథలుగా రాశారు. ఈ సంపుటిలో 92 కథలున్నాయి. 'ఒరు బుక్కింగు, క్లర్కు పామిస్ట్రీ (లేక) రయితు సమస్య" కథ నేటికీ అమాయకపు రైతుల స్థితికి అద్దం పడుతుంది. రైల్వే స్టేషను ప్లాట్‌ఫారమ్ మీదకు రైలు రావడం రైతు నిడదవోలుకు టిక్కెట్టు అడగటం బుక్కింగు క్లర్కు టిక్కెటు ఇవ్వకుండా జాప్యం - చదువుకున్న ఓ క్రిస్టియన్ యువతి కూడా టిక్కెటు అడగడం- రైతును నిర్లక్ష్యం చేయడం రైతు పక్ష నాయకుడు రైతుకు మద్దతు-రైలు బండి ఆపించి ...చదువుకొన్న యువతులు బండినెక్కించడం ... ఈ సమస్య లెజిస్లేటివ్ కౌన్సిల్లో మన రైతు సమస్య చర్చ...ఎంక్వైరీ కథాంశంగా సాగుతుంది. వెంకటేశ్వర దీపారాధన కథలో ప్రణయ లేఖలు కాల్చడం కథా వస్తువు. 'క్యాంపులో షాంపూయింగు' కథ శృంగారం ప్రధానమైనదే! రైలు ప్రయాణాలపైనే చాలా కథలు ఈ సంపుటిలో కనిపిస్తాయి. కలెక్టర్ కార్యాలయ గుమస్తా డఫేదారు.. దొరసానిని చూసిన డఫేదారు మనసు పడటం.. అతన్ని దొరసాని ఇంటికి వెళ్ళి పలుకరించడం... అతని మనస్సులోని భావాల్ని తెలపడం అతని ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పెట్టడం కథాంశం.1935లో నెరజాణ పత్రికలో ప్రచురణైన "ఆడదాని వూసు లేకుండా" అనే కథ కూడా శృంగార కథే. రచయిత అతని సహాయకుడు "వ్రాయసగాడు" స్త్రీ అంశం లేకుండా రచనలు ఉండవు... అనే అంశంతో ఈ కథని ఆ రోజుల నాటి పరిస్థితుల్ని దృష్టిలో పెట్టుకొన్ని రాశారు. ఒక పేజీలో కవి కొండలవారి దస్తూరి ప్రచురించారు. యుద్ధానంతర పరిణామం - ఇంద్రధనస్సు-1936లో జరిగింది. 766 శకుంతల, ఎద్దడి నీళ్ళు, చెల్లమ్మ సినీమా చూపు, వైస్రాయి స్పెషల్, రెండు గుండెల ఫిల్మ్‌స్టార్ కథలు బాగా పాఠకుల్ని అలరిస్తాయి. 92 కథల విందు భోజనం.



కవి కొండల వెంకటరావు కథలు (2వ సంపుటం)
రచయిత: కవి కొండల వెంకటరావు
పేజీలు: 414/-, వెల: 270/-
ప్రతులకు: నవ చేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ, హైదరాబాద్
విశాలాంధ్ర బుక్ హౌస్ అన్నీ బ్రాంచీల్లో లభ్యం



డా॥ బాబా సాహెబ్ అంబేద్కర్ వ్యాసాలు-ఉపన్యాసాలు
రచయిత: కత్తి పద్మారావు
పేజీలు: 158/-, వెల: 150/-
ప్రతులకు: కత్తి స్వర్ణకుమారి
లోకాయత ప్రచురణలు,
లుంబినీవనం, పొన్నూరు



3000 ఏండ్ల దళిత ఉద్యమ చరిత్ర
రచయిత: కత్తి పద్మారావు
పేజీలు: 589/-, వెల: 500/-
ప్రతులకు: కత్తి స్వర్ణకుమారి
లోకాయత ప్రచురణలు,
లుంబినీవనం, పొన్నూరు

సో ష్వీట్...

మరో రెండు బుల్లి పాదాల్ని ముద్దాడే చాన్స్ డాడీకి రాబోతోందని మమ్మా ఎలా చెబితే బాగుంటుంది. అదే తాను ప్రెగ్నెంట్ అని. అప్పటి వరకు ఇంట్లో హల్‌చల్ చేసిన బుడ్డోళ్లకు ఈ షాకింగ్ న్యూస్ ఎలా కన్వే చేయాలి. బిడ్డలా పెంచుకుంటున్న పప్పీలకు సెక్యూరిటీ గార్డ్ పనప్ప జెప్పేస్తున్నామని ఎలా తెలిపేది. అసలీ ప్రపంచానికి ఈ సో ష్వీట్ మాటను షేర్ చేసుకునేదే విధంగా. ఇదిగో బుడ్డోళ్ల తలపులతో క్రేజీ అయిపోయిన ఈ కాబోయే తల్లిదండ్రులు, తుంటరి దండుకు మరో పిడుగును జతచేస్తున్న భార్యాభర్తలు ఇలా అనౌన్స్ చేస్తున్నారు.

బొమ్మతో పెళ్లి

మనసుకు నచ్చిన వారిని మనువాడాలని... కష్టసుఖాలను కలిసి పంచుకోవాలని... ఎవరికి
మాత్రం వుండదు. ఈ చైనా యువకుడు సైతం అలాంటివాడే. కాకపోతే అతనికా అదృష్టం లేదు.
కలలో కూడా రాకూడదని భావించే క్యాన్సర్ వ్యాధి అతన్ని ఆవహించడంతో పెళ్లి కలలన్నీ
కల్లలైపోయాయి. అయినంత మాత్రాన నీరసపడిపోలేదు. తన చివరి కోరికగా పెళ్లి మాత్రం
చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. అయితే తన కారణంగా ఓ అమ్మాయి జీవితం మధ్యలోనే
మోడువారకూడదన్నది అతని కోరిక. ఇవి రెండూ ఎలా సాధ్యం? సుసాధ్యం చేశాడు!
సరిగ్గా తనకు సరిపడా ఎత్తుండే అందమైన బొమ్మతో పెళ్లి పీటలెక్కాడు.
చూశారుగా పెళ్లికూతురు ఎంత అందంగా వుందో! ఆ ఘనత సైతం అతగాడిదే.
తనకు నచ్చిన బొమ్మను ఎంపిక చేశాక దానికి మేకప్ వేయడానికి,
కేశాలంకరణ చేయడానికి, సందర్భానికి తగ్గట్టుగా అందమైన బట్టలు
వేయడానికి ముగ్గురు స్పెషలిస్టులను ఏర్పాటు చేశాడు. ఖర్చుకు ఏమాత్రం
వెనుకాడలేదు. వివాహం అయ్యాక... బాల్‌రూమ్ డ్యాన్సులు, ఫొటోలు,
వీడియోలు... వేటికీ కొదవ లేదు. ఆ ఫొటోలు ఇప్పుడు అంతర్జాలంలో
హల్‌చల్ చేస్తున్నాయి. మీ ముందు వున్నవి అవే.